# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త


కన్నుల పండువగా

# కాణిపాకం తెప్పోత్సవం

## -తెప్పలపై సేదతీరిన పార్వతీతనయుడు



కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల చివరిరోజు మంగళవారం రాత్రి సిద్దిబుద్ధి సమేతుడైన గణనాధుడు స్వామివారి పవిత్ర పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారికి మంగళవారం తెప్పోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఉభయదేవేరులతో స్వామివారు స్థానిక పవిత్ర పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులకు అభయహస్తం అందించారు. ఆలయంలో 21 రోజుల పాటు జరిగిన వార్షిక బహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవలలో ఊరేగుతూ అలసి సొలసిన స్వామి, అమ్మవార్లు చివరిరోజు తెప్పలపై విహరిస్తూ సేదదీరారు. ఈమేరకు మంగళవారం స్వామివారికి తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కీ॥శే॥ శ్రీ గాలి పుండరీకనాయుడు,వారి కుమారుడు శ్రీగాలి శేషాచలంనాయుడు కాకర్లవారిపల్లె, కీ॥శే॥ శ్రీ.ఆర్.శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, కాకర్లవారిపల్లె, కీ॥శే॥ జి.హనుమంతనాయుడు వారి కుమారులు, అడపగుండ్లపల్లె, కీ॥శే॥ యం.రామకృష్ణారెడ్డి గారి కుమారుడు ఎం.జగన్నాధరెడ్డి, కాణిపాకం, శ్రీ గురుజాల దామోదరనాయుడు, కొత్తపల్లె, కీ॥శే॥ చల్లగుండ్ల దామోదరనాయుడు వారి కుమారులు, కాకర్లవారిపల్లె, శ్రీగురుజాల ఆనందనాయుడు అండ్ బ్రదర్స్ దిగువ మారేడుపల్లె, శ్రీలంకిపల్లె మోహన్‌బాబు, 44 బొమ్మసముద్రం.ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులు పగలు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు అర్చకస్వాములు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి చంనాలంకారం చేసి దేదీప్యమానంగా అలంకరించారు. అనంతరం ధూపదీపనైవేద్యాలతో విశేష సమర్పణ గావించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే పుష్కరిణిలోని స్వామివారికి సాయంత్రం అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తిరిగి రాత్రి సిద్ధి,బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను ఆలయంలోని అలంకార మండపంలో వుంచి శోభాయమానంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుండి పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి వివిధరకాల పుష్పాలు, రంగురంగుల విద్యుత్‌ద్ధీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన తెప్పలపై వుంచి మరోమారు విశేషపూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ,ఏఈఓలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్,ధనుంజయ, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు పాల్గొన్నారు.

# సాంకేతికతతో ఎర్రచందనం పరిరక్షణ

## -తిరుపతి జిల్లా ఎస్పీకి సిఎం చంద్రబాబు సూచన



తిరుపతి,సెప్టెంబర్ 16ప్రభాతవార్త: శేషాచలంఅడవుల్లో ఎంతో విలువైన ఎర్ర చందనం పరిరక్షణకు సాంకేతిక పరిజ్ఞానం విని యోగించుకోవాలని, ఎర్రచందనం అమూ ల్యమైన సంపద అని సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్‌లు,ఎస్పీల సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రచందనం పరిరక్షణపై సిఎం ఎస్పీకి నిర్దేశం చేశారు.

# మద్యంతో ఊగుతున్న గ్రామాలు

- నెలకు పోలీసు, ఎక్సైజ్ అధికారుల జేబుల్లోకి రూ.31.20 లక్షలు
- జిల్లాలో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు
- ప్రతి పల్లెలో క్వాటర్ బాటిల్‌పై రూ.30 నుండి రూ.50 అధికంగా విక్రయాలు
- బెల్టుషాపులపై దాడులు చేయని పోలీసు, ఎక్సైజ్‌శాఖలు



ప్రైవేటు మద్యం షాపు

చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో మద్యం మత్తులో ఊగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మినరల్ వాటర్ అందుబాటులో వుండక పోయినా మద్యం బాటిళ్ళు మాత్రం విచ్చలవిడిగా లభ్యం అవుతున్నాయి. మద్యం విక్రయించడానికి ప్రభుత్వం షాపులకు లైసెన్సులు మంజూరు చేసినప్పటికీ జిల్లాలో ప్రస్తుం మద్యం షాపుల కంటే బెల్టుషాపుల్లోనే ఎక్కువ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం దుకాణాల్లో మినహాయించి ఎక్కడ మద్యం విక్రయాలు చేసినా వారిపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసు, ఎక్సైజ్ శాఖలు మామూళ్ళ మత్తులో జోగుతుండటంతో గ్రామాల్లో అనధికారి మద్యం దుకాణాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతున్నాయి. ఈ సారి ప్రభుత్వం మద్యం దుకాణ లైసెన్సులు కేటాయించడానికి రూపొందించిన మద్యం పాలసీలో మద్యం దుకాణదారులకు పెద్దగా లాభాలు వచ్చే అవకాశం లేదు. ఇది వరకు మద్యం షాపులు దక్కించుకున్న వారికి ప్రభుత్వం నుండి 25 నుండి 30 శాతం వరకు మార్జిన్ వుండేది. ప్రస్తుతం అమలులో వున్న మద్యం పాలసీలో మద్యం షాపు లైసెన్సులు దక్కించుకున్న వ్యాపారులకు ప్రారంభంలో కేవలం 9 శాతం మాత్రమే మార్జిన్ వుండేది. ఆపై ప్రభుత్వం ఈ మార్జిన్‌ను ప్రస్తుతం 14 శాతంకు పెంచింది. ప్రస్తుతం మద్యం షాపు యాజమానులకు 14 శాతం మార్జిన్ లభించినప్పటికీ అత్యధిక మద్యం షాపుల యాజమానులకు లాభాలు వచ్చే అవకాశం లేని పరిస్థితి నెలకొంది. మద్యం షాపు యాజమానులు లాభాల బాట పట్టాలంటే ప్రతి రోజు పెద్ద మొత్తంలో మద్యంను విక్రయించాల్సి వుంటుంది. ఎంత పెద్ద మొత్తంలో మద్యం దుకాణాలు మద్యం విక్రయిస్తే ఆ మేరకు లాభాలు వస్తాయి. దీంతో మద్యం షాపు యాజమానులు మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాలతో పాటు పల్లె ప్రాంతాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. మద్యం షాపు యాజమానులు బెల్టుషాపు నిర్వాహకులకు ఒక క్వాటర్ బాటిల్‌పై రూ.10 లాభం పెట్టుకుని విక్రయిస్తే, బెల్టుషాపు నిర్వాహకులు గ్రామాల్లో ఒక క్వాటర్ బాటిల్‌పై రూ.30 నుండి రూ.50 లాభం పెట్టుకుని మందుబాబులకు అమ్మకాలు జరుపుతున్నారు. ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్ అధికారులు పల్లెల్లో జరుగుతున్న బెల్టుషాపుల వ్యా పారంను ప్రశ్నించకుండా వుండేందుకు మద్యం షాపు యాజమానులే ఒక షాపుకు నెల వారి మామూళ్ళు నిర్ధేశించుకుని పోలీసు, ఎక్సైజ్ శాఖలు బెల్టుషాపుల జోలికి వెళ్ళకుండా కట్టడి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 104 మద్యం షాపులు వున్నాయి. ఒక్క మద్యం షాపు లైసెన్సును టెండర్లలో పాల్గొని దక్కించుకోవడానికి మద్యం షాపు యాజమానులకు ఎక్కువ ఖర్చు అయ్యింది. ప్రస్తుతం అమలులో వున్న ఎక్సైజ్ పాలసీ ప్రకారం మద్యం షాపు దక్కించుకోవడానికి మద్యం షాపు యాజమాని దరఖా స్తుతో పాటు రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ ఫీజుతో పాటు ఒక ఏడా దికి 55 లక్షల రూపాయల రెంటల్ ఫీజు చెల్లించడంతో పాటు ఎక్సైజ్ డిపో నుండి మద్యం కొనుగోలుకు పెట్టుబడిగా కనీసం 20 లక్షల రూపాయల వరకు రొటేషన్ కింద పెట్టుకోవాల్సి వుంటుంది. అలాగే షాపుకు అద్దెతో పాటు అక్కడ పని చేయడానికి వచ్చే సిబ్బందికి జీతాలు చెల్లించుకోవాల్సి వుంటుంది. గత ప్రభుత్వంలో ఐదేళ్ళ పాటు మద్యం దుకాణాల ద్వారా ఎలాంటి ఆదాయం లేకపోవడంతో ప్రస్తుతం మళ్ళీ ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులు కేటాయించడంతో ఐదేళ్ళుగా ఆకలి మీద వున్న పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం షాపులపై పడ్డారు. ప్రారంభంలో మద్యం షాపు యాజమానులు తమ పరిస్థితి బాగలేదని మొత్తుకుంటే ఒక నెల రోజుల పాటు వదలిపెట్టారు. మరుసటి నెల నుండి ఒక మద్యం షాపు నుండి ప్రతి నెల పోలీసులకు 15 వేల రూపాయలు, ఎక్సైజ్ అధికారులకు 15 వేల రూపాయలు చెల్లించడానికి షాపు యాజమానులు అంగీకరించినట్లు తెలిసింది. జిల్లాలో మొత్తం 104 మద్యం షాపులు వుండటంతో ఎక్సైజ్ శాఖకు ప్రతి నెల రూ.15.60 లక్షలు, పోలీసు అధికారులకు రూ.15.60 లక్షలు మామూళ్ళ రూపంలో షాపు యాజమానులు ముట్టజేబుతున్నారు. మద్యం షాపు యాజమానులు రెండు శాఖలను తమ అదుపులో పెట్టుకోవడంతో మద్యం షాపులు మూసివేసిన అనంతరం సైతం మద్యం షాపు పరిసరాల్లో వున్న బెల్టుషాపుల్లో రూ.30 అధికంగా చెల్లిస్తే కోరిన బ్రాండ్ మద్యం మందుబాబులకు లభ్యం అవుతోంది. ఒక మండలంలో రెండు మద్యం షాపులు వుంటే వున్న రెండు మద్యం షాపులు గ్రామాలను కేటాయించుకుని ప్రతి గ్రామంలో ఒక వ్యక్తి ద్వారా బెల్టుషాపు నిర్వహించి ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు చేస్తున్నారు. జిల్లా ఎక్సైజ్, పోలీసు శాఖలు మద్యం యాజమానులు ఇస్తున్న మామూళ్ళకు లోబడి గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్టుషాపులను కట్టడి చేస్తారా! లేక షాపు యాజమానులు ఇచ్చే మామూళ్ళు మాత్రమే తమకు చాలని గ్రామాల్లో మద్యం లభిస్తే ఎంత! లభించకపోతే ఎంత! అని మిన్నకుండి పోతారా! చూడాల్సి వుంది.

# ఏళ్ళు గడుస్తున్నా కదలని భవన నిర్మాణ పనులు





దొరవారి సత్రం ,సెప్టెంబర్ 16 ప్రభాత వార్త:

దొరవారిసత్రం బిసి గురుడు పాఠశాల, కళాశాలలో పనుల నిర్మాణం అసంతృప్తిగా ఉన్నాయి. వాటి గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరాకొరా వసతుల మధ్య పిల్లలు విద్య కొన సాగిస్తున్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే పనులు అర్ధాంతంగా వదిలేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇబ్బంది పడుతున్న విద్యార్థులను అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. దొరవారిసత్రం బిసి గురుకుల జూనియర్ కళాశాలలో 2017-18లో బీసీ గురువులు పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సమయంలో విద్యార్థులు ఉపాధ్యాయులకు కనీస వసతులు కల్పించలేదు. తర్వాత నాబార్డ్ కింద భవన నిర్మాణాలకు 4.5 కోట్లు నిధులు కేటాయించారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పెరగదు గదులు కోసం మూడు అంతస్తులతో రెండు బ్లాకులు ఉపాధ్యాయులు వసతి కోసం నాలుగు బ్లాకులు నిర్మాణం మొదలు పెట్టారు. తరగతి భవనాన్ని పూత పనులు వరకు పూర్తి చేశారు ఉపాధ్యాయుల వసతి సంబంధించి రెండు బ్లాకులు 90 శాతం వరకు చేపట్టి వదిలేశారు నిధులు కేటాయించకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఆ తర్వాత వాటి గురించి ఎవరు పట్టించుకోలేదు. దీంతో ప్రథమ ద్వితీయ సంవత్సరాల చదువుతున్న వందల మంది విద్యార్థులు అసంపూర్తి భవనంలోనే విద్య అభ్యసిస్తున్నారు. వసతి భవనంగా టీచర్ క్వార్టర్స్‌లో పాఠశాలలోని ఒక భవనంలో అతి కష్టం మీద ఉంటున్నారు. కళాశాల విద్యార్థులు భోజనం చేయాలంటే పాఠశాల డైనింగ్ హాల్లోకి వెళ్లాలి. కళాశాలకు అటు స్థానికంగా ఎలాంటి వసతులు కల్పించకపోవడం దారుణమని పిల్లలు తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

### వివిధ నిర్మాణాలు

డి వీ సత్రం బిసి గురుకుల పాఠశాల. కళాశాల విద్యార్థులు సౌకర్యార్థం కంప్యూటర్.ల్యాబ్. సైన్స్ బయాలజీ కెమిస్ట్రీ తరతర అన్ని వసతులతో భవన నిర్మాణ పనులు కొనసాగుతూ ఉన్నాయి అయితే అదే విధంగా విద్యార్థులు సౌకర్యార్థం 200 మీటర్ రన్నింగ్ నిర్మిస్తున్నారు. ఈ పనులు సర్వ శిక్ష అభియాన్ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

# బ్రహ్మాండంగా బ్రహ్మోత్సవాలు జరిపిస్తాం

## భక్తులకు అసౌకర్యం లేకుండా రద్దీ నియంత్రణ
## -గరుడసేవరోజు 4లక్షలమంది రావచ్చని అంచనా
## -టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్‌నాయుడు



తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా జరిపిస్తామని, ఇందుకు అన్ని ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలతో బాటు మూలవిరాట్టు దర్శనం భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తూ రద్దీ నియంత్రణ చేస్తామన్నారు. ఇందుకు ఇస్రో సేవలు వినియోగించుకుంటున్నామన్నారు. వారంరోజుల్లో మొదలు కానున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, టిటిడి చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబం ధించి మంగళవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన సాగిన బోర్డు సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలను టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి ఛైర్మన్ వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులను విశేషంగా ఆకట్టుకునేందుకు పుష్పాలంకరణలు, వివిధ దేవతామూర్తుల ఆర్చిలు, ఎల్ఇడి తోరణాలు, పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుమలలోని రద్దీ ప్రాంతాల్లో అదనపు సిసికెమెరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలు ,వృద్దులు తప్పిపోకుండా జియో ట్యాగింగ్ వేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గరుడసేవరోజు 4లక్షలమంది భక్తులు రావచ్చని అంచనా వేసి అందుకు తగ్గట్లు పూర్తిగా సౌకర్యాలు, ఏర్పాట్లు కల్పిస్తామన్నారు. 8లక్షల లడ్డూలు నిల్వచేస్తామన్నారు. టిటిడిపై దుష్ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డిప్రశాంతిరెడ్డి, ఎంఎస్‌రాజు, శాంతారామ్, నర్శిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలు వెంటనే తొలగించాలి

## - కడ పి.డి. వికాస్ మర్మత్



శాంతిపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

శాంతిపురంలో మండలంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. స్థానికంగా ఏర్పడ్డ ఆక్రమణలు తొలగించేందుకై అధికారులు, ప్రజాప్రతినిధులను పరుగులు పెట్టించారు. అసలు ఏ ంజరుగుతోందో తెలియక జనం పి.డి. వెంట పరుగులు తీశారు. శాంతిపురంలోని జీతీయ రహదారి పక్కన ఉన్న చిరు వ్యాపారులను వెంటనే ఖాళీ చేయించి వారికి పాత తారు రోడ్డుపై స్థలం కేటాయించి అక్కడ వ్యాపారాలు చేసుకునేలా అధికారుల్ని ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రైమరీ స్కూల్‌ను తనిఖీ చేసి భవనం పరిస్థితిపై ఆరా తీశారు. ఈ స్థల వివాదం కోర్టులో ఉందని అందుచేత అభివృద్ధి చేయలేకపోతున్నట్లు అధికారులు తెలిపారు. ఇంతలో ఈ స్థలంపై కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని ఓ వ్యక్తి తీర్పు పత్రాలు పి.డి.కి చూపించగా పి.డి అది చదివి అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయంగా ఎంపిడిఓ తాము ఇదివరకే ఈ స్థలం ప్రభుత్వ స్థలమని రాతపూర్వకంగా ఇచ్చామన్నారు. అనంతరం పోలీస్ ఔట్‌పోస్టును పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరుపై ఎస్సై నరేష్ వివరించారు. అనంతరం బడుగుమాకులపల్లి వారపు సంత వద్దకు చేరుకున్నారు. దుకాణదారులు తాము 1500-2000దాకా అదె ్దలు ఇస్తున్నట్లు తెలిపారు. అయితే ఆ స్థలం కూడా ప్రభుత్వానిదేనని నేతలు తెలపడంతో రికార్డుల పరిశీలనకు తహశీల్దార్‌కు ఆదేశించారు. కెనమాకులపల్లి పంచాయతీలో ప్రభుత్వ స్థలంలో చెరువు వద్ద కొందరుగృహాలు నిర్మించుకోగా వాటిని పిడి పరిశీలించారు. నోటీసులు జారీ చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. స్మశాన వాటికకు ఐదెకరాల స్థలం ఇవ్వాలని ఆదేశించారు. ఆరిముత్తనపల్లి వంకను పరిశీలించి ఆక్రమణలు పది రోజుల్లో తొలగింపుకు ఆదేశించారు. శాంతిపురంలోనే జాతీయ రహదారి ఫోర్‌లైన్ వెళ్తుందని త్వరలోనే సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, నేతలు విశ్వనాథ నాయుడు, సర్పంచ్ ఎవి జయరాం, కడ సభ్యురాలు సుగుణమ్మ, ఉదయ్‌కుమార్, రాధాకృష్ణనాయుడు, పిఏసిఎస్ ఛైర్మన్ గోపాల్, రమేష్, నాగరాజు, రాజు, విజయ్‌కుమార్, మురుగేష్ పాల్గొన్నారు.



మంగళవారం ఉదయం ఏపీ సచివాలయంలో సిఎం అధ్యక్షతన ప్రారంభమైన నాలుగవ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజు సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి ప్రభాతవార్త

# స్వచ్ఛకుప్పం సాధనకు నడుం బిగించాలి

## - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్




కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు పిలుపుమేరకు స్వచ్ఛకుప్పం సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం గ్రీన్‌వేవ్ సంస్థ ప్రతినిధి లావణ్య, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు నేతృత్వంలో విద్యార్థులు స్థానిక ప్యాలస్ వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఆర్‌రెడ్డి సర్కిల్‌లో మాష్ అప్ కార్యక్రమాలతో నృత్య ప్రదర్శనలతో విద్యార్థులు అదరగొట్టారు. అనంతరం జరిగిన సభలో డా॥ కంచర్ల మాట్లాడారు. ప్రతి రోజూ మనం మన ఇంటిని, పరిసరాలను ఎలా శుభ్రంగా ఉంచుకుం టామో పట్టణాన్ని సైతం అలాగే శుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీ అధ్వర్యంలో రోజూ పగలు,రాత్రి చెత్త సేకరణ జరుగుతోందన్నారు. ఇళ్ల వద్దనుంచే చెత్తను సేకరిస్తున్నారన్నారు. ఇటీవలే 80లక్షల విలువ చేసే కాంప్యాక్టర్ వాహనంతో పాటు 103 ఇ- ఆటోలను సైతం నియోజకవర్గంలో వ్యర్థాల సేకరణకు ప్రారంభించామన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ కుప్పం పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు కమీషనర్ శ్రీనివాసరావు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. పోటీల్లో గెలిచిన విద్యార్థుల బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కడ పి.డి. వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్,కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, సురేష్, వేలు, సోమశేఖర్, ఎంఆర్ సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, స్థానిక నేతలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రమాదాలకు నిలయం.. మఱ్ఱిగుంట సర్కిల్!

## లెక్కకు మించి మృతులు..., అంతకుమించి క్షతగాత్రులు..చోద్యం చూస్తున్న అధికారులు...

రేణిగుంట సెప్టెంబర్ 16ప్రభాతవార్త

నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారి రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని మఱ్ఱిగుంట సర్కిల్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడి రోడ్డు నిర్మాణం తీరు పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. అనునిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వందల సంఖ్యలో క్షతగాత్రులై శాశ్వత అంగ వికలాం గులుగా మారారు. ఎన్నో మరణాలు సంభవించాయి. ఇటీవల కాలంలో ఓ కంపెనీకి చెందిన బస్సు బోల్తా పడి ఎంతో మంది మహిళా కార్మికులు గాయాల పాలయ్యారు. అదేవిధంగా మరో కంపెనీకి చెందిన బస్సు ప్రమాదాన్ని గురై అదే కంపెనీకి చెందిన పలువురు క్షతగాత్రులు కాగా ఒకరు మృతి చెందారు. ద్విచక్ర వాహనాలు పరిధికి మించి ప్రమాదానికి గురై ఎంతోమంది మృతి చెందారు. పలువురు శాశ్వత అంగవైకల్యంతో అల్లాడుతున్నారు. పోలీసులు ప్రమాదాలు జరక్కుండా చర్యలు చేపట్టినప్పటికీ ప్రమాదాలు జరగడం ఆగడం లేదు. తాజాగా శనివారం ఓ వ్యాన్ లారీలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన మఱ్ఱిగుంట సర్కిల్...

ప్రయాణికుల సౌకర్యార్థం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ రహదారులు నిర్మించినప్పటికీ సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. వీటికి తోడు కొంతమంది లారీ డ్రైవర్లు రోడ్డు పక్కన ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా వాహనాలను నిలపడం వల్ల రాత్రి సమయాల్లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఎవరో చేసిన పాపం ఇంకొకరికి శాపంగా మారింది అన్న చందాన ఉంది ప్రస్తుత పరిస్థితి. ప్రతిరోజు ఏదో ఒక ప్రమాదం సర్కిల్ వద్ద జరుగుతూనే ఉంది. రహదారులు అమాయ ప్రయాణికుల రక్తంతో రక్తదాహాన్ని తీర్చుకుంటున్నాయి. సర్కిల్ వద్ద సూచిక బోర్డులు నామమాత్రంగా అధికారులు ఏర్పాటు చేశారు. అందువల్ల సర్కిల్ వద్ద పరిస్థితి పద్మ వ్యూహంలాఉంది. ఈ నేపథ్యంలో వాహనాలు దారులు ఎటు వెళ్లాలో అర్థం కాక పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ కారణం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కిల్ వద్ద ఏర్పడిన అగమ్య గోచర పరిస్థితి కారణంగా శ్రీకాళహస్తి వైపు వెళ్లాల్సిన వాహనాలు కడప వైపు, కడప వైపు వెళ్లాల్సిన వాహనాలు శ్రీకాళహస్తి వైపుకు వెళుతున్నాయి. కొంత దూరం వెళ్లిన తర్వాత దారి తప్పమని తెలుసుకొని యూటర్న్ తీసుకోవడానికి చాలా దూరం ప్రయాణించాల్సి ఉండడంతో వ్యతిరేక మార్గంలో వెనక్కు వస్తున్నారు. వ్యతిరేక మార్గంలో రావడం ప్రమాదాలు జరగడానికి మరో కారణంగా చెప్పుకోవచ్చు. తక్షణం జాతీయ రహదారులు,ఆర్ అండ్ బి, ట్రాన్స్పోర్ట్ , పోలీసులు అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించి అక్కడ ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు అర్థమయ్యే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా గతంలో మాదిరి సర్కిల్ వద్ద ఆర్టీవో చెక్పోస్ట్ ఏర్పాటు చేస్తే వాహనాలు వేగం తగ్గించి వాహనాలను నిలిపి పర్మిట్లను తనిఖీ చేయించుకోవడం వల్ల దాదాపు ప్రమాదాలను నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన అర్డీఓ

యాదమరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

యాదమరి మండలంలో మరో కొత్త సబ్ స్టేషన్ నిర్మించడానికి అర్డీఓ శ్రీనివాసులు మంగళవారం స్థల పరిశీలన చేసి వెళ్ళారు. జోడిచింతల నుండి కొట్టాలం రహదారిలోని నడిమూరు గ్రామ పరిసరాల్లో ఎపిఎస్‌పిడిసి కొత్త సబ్ స్టేషన్ నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ మేరకు ఈ పరిసర ప్రాంతంలో సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన స్థలం అవసరం కావడంతో అర్డీఓ శ్రీనివాసులు మంగళవారం నడిమూరు పరిసర ప్రాంతంలో వెళ్ళి స్థలంను పరిశీలించి వచ్చారు. తహసిల్దారు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి అవసరమైన 35 సెంట్ల స్థలంను అర్డీఓకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిడిసిఎల్ డిఇ మునిచంద్ర, తహసిల్దారు పార్థసారథి, ఎఇ గుర్రప్ప, మండల సర్వేయర్ తులసీ, విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

## అవసరం మేరకు యూరియా వినియోగం

యాదమరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:




పంటలు సాగు చేయడంలో రైతులు అవసరం మేరకు యూరియా వినియోగం చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దీప పేర్కొన్నారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వరదరాజులపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా యూరియా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి దీప మాట్లాడుతూ యూరియా పంటల విస్తీర్ణం, అవసరంను బట్టి సరఫరా అవుతుందన్నారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. యూరియాను సరైన విధంగా వినియోగించుకోవడంతో పాటు నానో యూరియా, నానో డిఎపి వాడకంను ప్రోత్సహించాలన్నారు. పశుగ్రాస పంటలో యూరియా వినియోగంను తగ్గించాలన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో వుంచుకుని యాదమరిలోని మానాగ్రామ్‌లో యూరియా లభ్యం అవుతుందన్నారు.

## ఆటవిడుపుగా నేతల నృత్యాలు.. విద్యార్థుల చప్పట్లు

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



ఎప్పుడూ వివిధ కార్యక్రమాలు, రాజకీయ కార్యకలాపాలతో బిజీగా ఉండే నాయకులు మంగళవారం ఆటవిడుపుగా నేతలు నృత్యాలు చేస్తూ విద్యార్థులను అలరించారు. విద్యార్థులు జోరుగా చప్పట్లు కొట్టారు. ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు కుప్పం ఎంఆర్ రెడ్డి సర్కిల్‌లో స్థానిక డ్యాన్సర్లతో కలసి ఉత్సాహంగా నృత్యాలు వేసి అలరించారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రీ ప్లేస్‌మెంట్ డ్రైవ్

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



స్థానిక డా॥ వైసి జేమ్స్ ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో మంగళవారం ప్రీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ డా॥ జగన్నాథరావు తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరు కాగా వీరిలో 58మంది విద్యార్థులను ఎంపిక చేసి డిప్లమో అనంతరం వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రేన్స్ టెక్నాలజీస్ బెంగళూరు సంస్థచే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ అంపిలి,పూజ,యోగమూర్తి,హెచ్ఓడి రామకృష్ణరావు, కోఆర్డినేటర్ మాణిక్యం,ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## 20వ వార్డుకు స్వచ్ఛవార్డు పురస్కారం

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



స్వచ్ఛకుప్పం- స్వర్ణకుప్పంలో భాగంగా మున్సిపాలిటీలోని ఇరవయ్యవ వార్డుకు స్వచ్ఛవార్డు పురస్కారం లభించింది. మంగళవారం ఈ పురస్కారాన్ని వార్డు కౌన్సిలర్ సోమశేఖర్‌కు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి -ఘనంగా స్కూల్‌గేమ్స్

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కుప్పంలయన్స్‌క్లబ్‌సలహాదారుమహేష్ పేర్కొన్నారు. ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చిత్తూరు వారి అధ్వర్యంలో ద్రవిడ వర్సిటీ స్టేడియంలో కుప్పం, గుడుపల్లె మండలాల విద్యార్థులకు డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు సైతం సాధించవచ్చన్నారు. ఎంఇఒలు శ్రీదేవి, రాజారాం, నోడల్ హెచ్‌ఎం రంగనాథం, కోఆర్డినేటర్ వేణుగోపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డా॥ సుదర్శన్, కోశాధికారి లెనిన్, సభ్యులు జయరాం నాయుడు, హెచ్‌ఎంలు, పిఇటిలు పాల్గొన్నారు

## ఓజోన్ పొరను రక్షించడం మన బాధ్యత

కల్లూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త

ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి మానవుని మీద ఉందని కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. శ్రీవాణి తెలిపారు. ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కర్బన ఉద్గారాల ఫలితంగా ఓజోన్ పొరకు వాటిల్లుతున్న నష్టాలను వివరించారు. పాఠశాల విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు రహమత్ భాష, రేణుకాదేవి, రాజేంద్రలు మాట్లాడుతూ భూమి యొక్క స్ట్రాటో ఆవరణంలో 15 - 30 కిమీ ఎత్తులో వున్న పొరను ఓజోన్ పొరగా పేర్కొంటారని, ఇవి సూర్యుని నుండి వెలువడే హాని కరమైన అతినీల లోహిత కిరణాలను శోషించుకుంటూ మానవ జాతికి రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. అంతే కాక ఈ కిరణాల నుండి మొక్కలు జంతువులను, కాపాడుతాయని, మనుషులలో చర్మ కేన్సర్, వడదెబ్బ, కంటి హాని నుండి రక్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఏసిలు, ఫ్రీజర్స్ నుండి వెలువడే క్లోరోఫ్లోరో కార్బన్‌లు ఓజోన్ పొర క్షీణతను ప్రధాన కారణమని తెలిపారు. అందువల్ల కర్బన, పదార్థాల వాడకం తగ్గించి ఓజోన్ పొరకు రక్షించాలని సూచించారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

కల్లూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త



చల్లా బాబురెడ్డితో కలిసి సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్ర పట్టానికి అంగన్వాడీలు పాలభిషేకం చేసారు. గ్రేడ్ 2 నుంచి గ్రేడ్ 1 అంగన్వాడీలుగా మార్చుతూ 4700 అంగన్వాడీ పాఠశాలలను పునరుద్ధరణ పునరుద్దరనిచ్చినందుకు వారి వేతనాలను 7 వేల రూపాయల నుంచి 11 వేల రూపాయలు పెంచి నందుకు పుంగనూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చల్లా బాబురెడ్డి ఆధ్వర్యంలో పులిచర్ల మండలంనందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పట్టానికి పాలాభిషేకం నిర్వహించారు.

## మెగా డీఎస్సీలో వికసించిన యాదవ కుసుమాలు

పాలసముద్రం: సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:




పాలసముద్రం మండలం వన దుర్గాపురం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులను కైవసం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే వన దుర్గపురం గ్రామానికి చెందిన హరిబాబు మెగా డీఎస్సీ పరీక్షలో మూడు సబ్జెక్టులకు సంబం ధించి పరీక్ష రాయిగా మూడు సబ్జెక్టులలో జిల్లా స్థాయిలో సోషల్ 77.4 మార్కులతో 26 ర్యాంక్ ఎస్ జి టి 75 మార్కులతో 71వ ర్యాంక్ టిజిటి సోషల్ లో 76.63 మార్కులతో 21వ ర్యాంక్ సాధించి స్థానిక ప్రజలను ఆశ్చర్యపరిచాడు ఇతని తోపాటు ఇదే గ్రామానికి చెందిన లక్ష్మీ నరసింహులు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ లో జిల్లా స్థాయిలో 6వ ర్యాంకును సాధించాడుచెందిన ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు విద్యార్థులుజిల్లాస్థాయిలోర్యాంకులు తేవడంతో వీరిపై మండలం లోని ప్రజలు ప్రశంసలు జల్లు కురిపిస్తున్నారు

## శ్రీ రామ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్‌లో ఏఐపై అభ్యాసం.

**తిరుపతి విద్య సెప్టెంబర్ 16 ప్రభాత వార్త:** స్థానిక కరకంబాడి మార్గంలోని శ్రీరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్ లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్),యంత్ర అభ్యాసం (మిషన్ లర్నింగ్) అనే అంశాలపై విద్యార్థులకు నిపుణులచే ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలి పింది.




ముఖ్యఅతిథిగా హాజరైన పుత్తూరు సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ సి.శివకుమార్ ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సివిల్ ఇంజనీరింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందో విద్యార్థులకు వివరించారు.ఏఐ, ఎమ్ ఎల్ ఆధారిత సాఫ్ట్ వేర్ లు నిర్మాణ రంగంలో రూపకల్పన, అంచనా, ప్రణాళిక,అమలు విధానాలను ఎలా మెరుగుపరుస్తాయో కొన్ని ఉదాహరణలతో విద్యార్థులకు విశదీకరించారు.అధునాతన సాఫ్ట్ వేర్ లను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని కోరుతున్నట్లు కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద కుమార్ రెడ్డి,కళాశాల వైస్ ప్రిన్సిపల్ వాసు సూచించారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ సివిల్ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ భరత్,వివిధ విభాగ బోధనా సిబ్బంది,100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## సెక్షన్ ఆఫీసర్ త్వరగా కోలుకోవాలని పూజలు

పలమనేరు టౌన్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:



ఒంటరి ఏనుగు దాడిలో గాయపడ్డ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ త్వరగా కోలుకోవాలని మంగళవారం అటవీశాఖ సిబ్బంది స్థానిక అటవీశాఖ కార్యాలయంలో పూజలు చేశారు. త్వరగా కోలుకొని ఇంటికి వస్తే తిరుమలకు కాలనడకన వెళ్ళి మొక్కు తీర్చుకుంటామని కోరుకున్నారు. ఈనెల 13న పలమనేరు గంగవరం మండలాల్లో ఒంటరి ఏనుగు భీభత్సం చేసిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా ఏనుగు దాడిలో సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ కాలు చేయి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నెల 15న తిరుపతి రూయా ఆసుపత్రిలో ఈయనకు శస్త్ర చికిత్స చేశారు. అటవీశాఖలో పనిచేసే ఏ ఉద్యోగికి ఏ కష్టమొచ్చినా ఆదుకునే వారని వయసు చిన్నది మనసు పెద్దది అయిన ఆయనకే అలాంటి కష్టం వచ్చిందని కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యారు.

## దాతలచే ఉచిత ప్రసాదాల పంపిణీ

కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం జరిగిన తెప్పోత్సవం సందర్భంగా పలువురు దాతలు భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమైన ఉత్సవ రోజుల్లో పలువురు దాతలు భక్తులు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేస్తుంటారు. ఈమేరకు మంగళవారం జరిగిన తెప్పోత్సవం సందర్భంగా పలువురు దాతలు ఆలయ వద్ద ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని ఆలయ ఈఓ పెంచల కిషోర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## 19న కాణిపాకం హుండీల లెక్కింపు

కాణిపాకం,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 19న హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు స్థానిక యూనియన్ బ్యాంకు వారిచే జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

## నేడు విశ్వకర్మ జయంతి

**చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** కలెక్టరేట్‌లో బుధవారం 10.30 గంటలకు విశ్వకర్మ జయతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

– మున్సిపల్ కమీషనర్ పి.నరసింహప్రసాద్

చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ మంగళవారం నగర పరిధిలో పలు పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వెంగళరావు కాలనీలో వర్షపు నీరు వీధుల్లో నిలుస్తుందనే ఫిర్యాదుపై కమీషనర్ పరిశీలించారు. స్థానికంగా మురుగునీటి కాలువలను పరిశీలించి చేపడుతున్న పారిశుధ్య పనులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. మురుగునీటి కాలువలకు అవుట్‌లెట్ లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని గుర్తించారు. కాలువలకు అవుట్‌లెట్లు ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కమీషనర్ ఆదేశించారు. మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేసి వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నగరపాలక పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులు, గ్యాంగ్ వర్కులపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## భావి తరాల రక్షణకు ఓజోన్ సంరక్షణ తప్పనిసరి

– అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



ఓజోన్ పొర భూమిపై జీవానికి సహజ సిద్ధమైన రక్షణ కవచంగా వుందని, దీనిని సంరక్షించడం ద్వారా ఆరోగ్యంను, వాతావరణంను, భవిష్యత్ తరాల భద్రతను కాపాడవచ్చునని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ పేర్కొన్నారు. అపోలో యూనిర్సిటీలోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లో మంగళవారం ఓజోన్ పరిరక్షణ అంతర్జాతీయ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ మాట్లాడుతూ ఓజోన్ పొరను 1912లో కనుగొవడం నుండి 1985లో ఓజోన్ పొరలో 40 శాతం నష్టం బయటపడటం వరకు జరిగిన పరిణామాలను ఆయన విద్యార్థులకు వివరించారు. 1987లో అన్ని దేశాలు కలిసి సంతకం చేసిన మాంట్రియాల్ ప్రోటోకాల్ ఓజోన్ రక్షణలో మలుపు తిప్పిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ రామయ్య ఇటుమల్ల, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఫిరోజ్ బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా పర్యాటక అధికారిగా ఎం.ఎం నరేంద్రకుమార్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



జిల్లా పర్యాటక అధికారిగా ఎం.ఎం నరేంద్రకుమార్ నియమితులయ్యారు. ఎన్‌పి సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.ఎం నరేంద్రకుమార్‌ను ప్రభుత్వం డిప్యుటేషన్‌పై జిల్లా పర్యాటక అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎం.ఎం నరేంద్రకుమార్ టూరిజంపై అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. విద్యారంగం, సామాజిక రంగాల్లో వున్న అనుభవంను గుర్తించి ప్రభుత్వం ఆయనను జిల్లా పర్యాటక అధికారిగా నియమించింది.

## ఓట్ చోరీపై లక్ష సంతకాలు సేకరణ

– నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కి రాయల్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:




బీహార్ రాష్ట్రంలో జరిగిన ఓట్ చోరీపై ప్రతి జిల్లాలో లక్ష సంతకాలు సేకరించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించడంతో ఆ మేరకు చిత్తూరు జిల్లాలో ఓట్ చోరీ అంశంపై ప్రతి ఒక్కరు సంతకాలు చేసి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంకు పంపాలని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కి రాయల్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఓట్ చోరీపై కాంగ్రెస్ నాయకులతో టిక్కి రాయల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు టిక్కి రాయల్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఓట్లను దొంగతనం చేసి దేశంలో అధికారం చెలాయిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ బిజెపి చేసిన ఓట్ల దొంగతనంను పక్కా ఆధారాలతో నిరూపించడంతో ప్రజాబలంతో బిజెపి అధికారం చెలాయించడం లేదనే విషయం స్పష్టమైందన్నారు. దేశంలో జరిగిన ఓట్ల దొంగతనంపై ప్రతి ఒక్కరు స్పందించి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి కార్డు రూపంలో బకాయిల వివరాలు

– రాష్ట్ర వైఎస్‌ఆర్‌టిఎ కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

**చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉపాధ్యాయ, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల వివరాలను కార్డు రూపంలో తెలియజేయాలని రాష్ట్ర వైఎస్‌ఆర్‌టిఎ కోశాధికారి వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్‌సి ఆరియర్స్, డిఎలు, పిఎఫ్ మొత్తాలు, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవులు, మెడికల్ బిల్లులు తదితర బకాయిల వివరాలను పొందుపరచి డ్రాయింగ్ ఆఫీసర్ సంతకంతో కార్డును ప్రతి ఉద్యోగికి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించకపోవడం వల్ల వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఆర్థిక బకాయిలు చెల్లించడం సాధ్యం కాకుంటే బకాయిల కార్డుపై బ్యాంకులు రుణ సదుపాయం కల్పించే విధంగా ప్రభుత్వ తగు ఆదేశాలు జారీ చేసి ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జరుగనున్న మంత్రి వర్గ సమావేశంలోఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. లేకుంటే ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యా యులకు బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారనే విషయంపై ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడానికే స్వస్థనారీ

గుడిపాల, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



సమాజంలో మహిళలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడమే స్వస్థవారి కార్యక్రమం ముఖ్య లక్ష్యమని గుడిపాల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. పిహెచ్‌సి ఆవరణలో మంగళవారం డాక్టర్ సంధ్య ఎఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిహెచ్‌సి డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్థవారి కార్యక్రమంను మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు, ఇఎన్‌టి, రక్తపోటు, రక్తంలో చక్కెర శాతం, దంత పరీక్షలు తదితర వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలకు యాంటీ నేటల్ పరీక్షలు వాటికి సంబంధించిన రోగ నిరోధక టీకాలు అందించడం జరుగుతుందన్నారు. స్త్రీలు ఆరోగ్యవంతంగా వుండటంతో కుటుంబం ఆరోగ్యవంతంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ సూర్యనారాయణ, మలేరియా సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఎఎన్‌ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మజ్దూర్ వర్కర్లకు మార్కెట్ రేట్లకు అనుగుణంగా కనీస వేతనాలు పెంపు

– జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



ప్రభుత్వ రంగంలో పని చేసే ఎన్‌ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు మార్కెట్ రేట్లకు అనుగుణంగా కనీస వేతనాల పెంపు జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్‌లో మంగళవారం ఎన్‌ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు కనీస వేతనాల పెంపుపై జిల్లా కార్మిక శాఖతో కలిసి జిల్లా అధికారులతో డిఆర్ఓ మోహన్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరిల్లో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఎన్‌ఎంఆర్‌లు, మజ్దూర్ వర్కర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికులకు కార్మిక కనీస వేతనాల చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు అనుగుణంగా సంవత్సరానికి 5 నుండి 10 శాతం వేతనాల పెంపు వుంటుందన్నారు. ఇందుకు అనుగుణంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎన్‌ఎంఆర్, మజ్దూర్ వర్కర్ల జీతాల పెంపుకు సంబంధించి కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన నిర్ణయం తీసుకుని కనీస వేతనాల పెంపును ఆమోదించడం జరుగుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నైపుణ్యంలేని పాక్షిక, సంపూర్ణ నైపుణ్యం గత వర్కర్లుగా విభజించి వేతనాల పెంపుకు ప్రతిపాదికగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక కమీషనర్ ఆలోచన, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రమణకుమార్, డ్వామా పిడి రవికుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్..డిఎపి కొంటేనే యూరియా విక్రయాలా??

– లబోదిబోమన్న రైతులు.. దుకాణదారుడికి నోటీసులు

శాంతిపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

ప్రభుత్వం రైతులకు యూరియా కొరత లేకుండా ఓ వైపు చర్యలు తీసుకుంటుంటే శాంతిపురం మండలంలో ఎరువుల దుకాణదారులు ఇదే అదునుగా భావించి యూరియా కొనే రైతుల నెత్తిన అదనపు ఎరువుల భారం మోపుతున్నారు. యూరియా కొనేందుకు వచ్చే రైతులకు డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు సైతం కొనాలని వేధిస్తున్నారు. దీంతో రైతులు చేసేది లేక వాటిని కొనాల్సి వస్తోంది. తమకు యూరియా మాత్రమే కావాలని అడిగితే స్టాక్ అయిపోయిందని ఎరువుల దుకాణదారులు పేర్కొంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు సైతం దుకాణదారులతో కుమ్మక్కయ్యారా అని రైతులు చర్చించుకుంటున్నారు. ఈవిషయంగా వ్యవసాయాధికారిని ప్రభాతవార్త ఫోన్‌లో వివరణ కోరగా రెండు రోజుల్లో రైతు సేవా కేంద్రాలకు యూరియా వస్తోందని అక్కడే పంపిణీ చేస్తామన్నారు. రైతులు ఎవరూ యూరియా కోసం ఇతర ఎరువులు కొనాల్సిన అవసరం లేదన్నారు. ఏదేని సమస్యలు ఉంటే రైతులకు తమకు ఫిర్యాదు చేస్తే ఆ దుకాణాలను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు.

## రాజకాలువను పూడ్చేస్తున్నారు

చౌడేపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



చెరువులు, వంకలు, కాలువలు ఆక్రమించరాదన్న అధికారుల హెచ్చరికలను పక్కనబెట్టి ఏకంగా చెరువుకు నీటిని తీసుకెళ్ళే ప్రధాన వనరులను ఆక్రమించుకొంటున్నారు. పట్టణంలోని పుంగనూరు మార్గంలో చిత్రెడ్డిపల్లిచెరువుకు వర్షపు నీటిని నింపే రాజుకాలువ దురాక్రమణకు గురవుతోంది. నిత్యం అధికారులు సంచరించే ప్రదేశంలోనే యదేచ్ఛగా రాజుకాలువ ఆక్రమణ జరుగుతున్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా వుందని రైతులంటున్నారు. చౌడేశ్వరీపెద్దచెరువులో నీరు నిండితే అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిసివసతిగృహం, కళ్యాణమండపం నుంచి గుండుబావి మీదుగా మొరవనీటితోపాటు వర్షపు నీరు రాజుకావల ద్వారా చిత్రెడ్డిపల్లి చెరువులోకి చేరుతాయి. అయితే కొందరు వ్యక్తులు రాజుకాలువ సమీపంలో ఆదాయ సముదాయ భవనాలను నిర్మించుకొని దారి కోసం రాజుకాలువను మరింతగా కుదించి వీధికాలువ రీతిలో కట్టేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోక పోతే ఇక్కడొక రాజకాలువ వుండేదని చెప్పుకోవాల్సి వస్తుందని వారంటున్నారు. చిత్రెడ్డిపల్లిచెరువుకు వర్షపునీరందించే ప్రధాన వనరు ఈ రాజకాలవే కాబట్టి ఆయకట్టు రైతులఉు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అండర్-14 17కబడ్డీ పోటీల్లో విజేతలు వీరే

చౌడేపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్‌ఎల్ క్రీడల్లో భాగంగా మండల స్థాయి అండర్-14, 17 కబడ్డీ పోటీలు జరిగాయి. మండలంలో గల ఉన్నత పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ బాలికల విభాగంలో పుదిపట్ల మొదటి స్థానం, చౌడేపల్లి ద్వితీయస్థానం, బాలుర విభాగంలో మొదటి స్థానంలో చౌడేపల్లి, ద్వితీయ స్థానంలో పుదిపట్ల, జూనియర్ బాలుర విభాగంలో చారాల మొదటిస్థానం, పుదిపట్ల రెండస్థానం, జూనియర్ బాలికల విభాగంలో పుదిపట్ల మొదటిస్థానం, చౌడేపల్లి రెండవస్థానం సాధించారు. ఎంఇఓ కేశవరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రేణుక, విశ్రాంత పిడి రామచంద్రయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేంద్ర, మండలంలోని ఉన్నతపాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్సులో దుకాణాల నిర్వహణకు వేలం పాటలు

బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగాపురంలో గల షాపింగ్ కాంప్లెక్సులు దుకాణాల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్సులో కిందభాగంలో 85దుకాణాలుండగా మంగళవారం నిర్వహించిన వేలం పాటలో 45దుకాణాలకు లైసెన్సుహక్కులు పొందారు. ఒక్కో దుకాణానికి పాటదారుడు రూ. 20వేలు డిపాజిట్టు చేయగా ఒక్కో దుకాణం రూ. 3200నుంచి 3500వరకు పాటను పాడినట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. సంవత్సరానికి ఒక్కసారిగా దుకాణ బాడుగను తీసుకొంటున్నట్లు ఆయన వివరించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు, ఆలయ అధికార, సిబ్బంది, స్థానికులు వేలం పాటలో పాల్గొన్నారు.

## లక్ష సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

– డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్

వెదురుకుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :



ఓటర్ల జాబిత అవకతవకల పై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమానికి ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నడుము బిగించి లక్ష సంతకాల సేకరణను విజయవంతం చేయాలిని చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ పిలుపు నిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని అలాంటి ఓటను విలువను భారతీయ జనతా పార్టీ దిగజార్చుతుందని ఆయన ఆరోపించారు. ప్రజలు మేలుకోవలసిన తరుణం వచ్చిందని ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత దేశం అవతరించిందరి దానిని కాపాడుకోవడం ప్రతి భారతీయుని బాధ్యత అని గుర్తించాలని కోరారు. రాహుల్ గాంధీ సంతకాల సేకరణను పవిత్రంగా తీసుకుని ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవలని చెప్పారు. ప్రతి జిల్లాలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం చేపటడం జరిగిందని నియోజకవర్గం నుంచి కోర్డినేటర్లు, మండల అధ్యక్షులు చొరవ తీసుకుని కార్యకర్తలను, నాయకులను, యువతను చైతన్యవంతులను చేసి సంతకాల సేకరణను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## జగమర్లలో పొలం పిలుస్తోంది

పలమనేరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:




పలమనేరు మండలం జగమర్లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ శాఖ జెడి మురళీక్రిష్ణ మాట్లాడుతూ వరి పంటకు సాంప్రదాయ ఎరువులు వేయడానికి బదులుగా నానో యూరియా ఉపయోగపడుతుందని తెలిపారు. దీనిపై ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో కలిసి వేరుసెనగ పంటలను పరిశీలించారు. పూత దశలో ఉన్నపంటకు ఆకుమచ్చ తెగులు సోకినట్లు గుర్తించారు. లీటరు నీటికి ప్రొపికొనొజాల్ మందును 200 మి.మీలు వంతున కలిపి ఒక ఎకరా పంటపై పిచికారీ చేయాలని సూచించారు. ఎఓ సంధ్య, సెరికల్చర్ అధికారి ఫిరోజ్‌బాషా, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

శాంతిపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నాలుగో దఫా ప్రవేశాలకు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శేషారెడ్డి కోరారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం ఈనెల 28 మధ్యాహ్నం 2గంటల్లోగా ఐటిఐ కార్యాలయంలో ఒరిజినల్ పత్రాలు అందించాలన్నారు. తదుపరి కళాశాలలో 29న కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డిఇఓ అభినందన



**తొట్టంబేడు,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** మండలంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకున్న కయ్యూరి బాల సుబ్రమణ్యంను విద్యాశాఖాధికారి సత్కరించారు. అభినందించారు. మండలంలోని దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ పాఠశాలలో పని చేస్తూ ఎన్నో అవార్డులనుఅ ందుకున్న బాలసుబ్రమణ్యం చిన్నారులకు చేసే విద్యాబోధన ఆటపాటలతో కూడుకున్నదన్నారు. బాలసుబ్రమణ్యం విధానాలను ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయనను విద్యాశాఖాధికారి కెవియన్ కుమార్ మంగళవారం హాజరై అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థుల సమగ్రాభివృద్ధికి మరింత కృసి చేయాలని జాతీయ స్థాయిలో అవార్డులు అందుకొని మీరు పని చేసే పాఠశాలకు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు సంక్షేమమే పరమావధిగా పని చేయాలి: పార్టీకి మంచిపేరు తేవాలి



**తొట్టంబేడు,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయ ప్రధాన కేంద్రంగా ఉంది. ఈ నియోజకవర్గంలో రైతులురెండు పంటలు పండిస్తారు.వారి అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి సహాకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తంగేళ్ళ పాళెం సింగిల్ విండో చైర్మెన్,సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిధిగా వచ్చారు.మరో అతిధిగా రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ హాజరయ్యారు.ఈ సందర్బంగా ప్రమాణ స్వీకారం సభకు హాజరైన ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నేడు ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసారు.అన్నదాత సుఖీభవ కింద ఆర్థిక సహాయం అందిస్తున్నాము.అంతేకాక రైతులకు సంబంధించిన సబ్సిడీ పథకాలన్నీ సింగిల్ విండో ల ద్వారా అందిస్తున్నాము.ముఖ్యంగా ప్రస్తుతం యూరియాకు సంబంధించి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తున్నా ప్రతిపక్షాలు యాగీ చేస్తున్నారని ఈ విమర్శలను తిప్పికొట్టాలన్నారు. తంగేళ్ళ పాళెం సింగిల్ విండో అధ్యక్షుడుగా బీమాల భాస్కర్,సభ్యులు ధనంజయులు,బత్తెయ్య ప్రమాణ స్వీకారం చేసారు.ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌కుమార్, మాజీ మార్కెటింగ్ కమిటి అధ్యక్షడు రంగినేని చెంచయ్యానాయుడు కన్నల ప్రతాప్, మాజీ పార్టీ అధ్యక్షుడు గాలి మురళినాయుడు,పేట బాలాజి,నెమళ్ళూరు బుజ్జి.వజ్రం కిషోర్,గంగల పూడి హరి తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఆలయ ఉద్యోగుల సస్పెండ్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** నిధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఉద్యోగులకు సస్పెండ్ నజరాన లభించింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న విజయసారధి,జూనియర్ అసిస్టెంట్ అన్వేష్‌లు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారి అయ్యాయి.వీరు ఆలయానికి అనుబంధంగా ఉన్న స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల బాధ్యతలు నిర్వహించే వారు. అయితే ఆలయ ఇఓ, దేవాదాయశాఖ కమిషనర్‌లపై కోర్టు కేసులు విచారణకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వక పోవటంతో కోర్టు ధిక్కారణ కేసు అయిందని దాంతో కమినర్ ఆగ్రహించారు. దేవాదాయశాఖ కమిషనర్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. కమిషనర్ ఆదేశాలతో ఇరువురిని సస్పెండ్ చేస్తూ ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి చర్యలు తీసుకున్నారు.

## దొంగ ఒట్లను అరికట్టండి : ప్రజాస్వామ్యాన్ని కాపాడండి



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** ఆల్‌ఇండియా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు తిరుపతిజిల్లా మైనారిటిసెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్‌చిరంజీవిల సారధ్యంలో ఓటర్ల తొ లగింపు అన్యాయమని చైతన్య సమావేశాలు నిర్వహించారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. రాష్ట్ర పార్టీ నాయకురాలు వైయస్‌షర్మిలా ఆదేశాలతో దొంగ ఓట్లను అరికట్టండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అనే మహత్తర కార్యక్రమాలను చేపట్టామన్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు జరిగే సంతకాల సేకరణ కార్యక్రమాల్లో భాగంగా సంతకాల సేకరణ ఉద్యమంగా చేపట్టామన్నారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం యూనియన్‌బ్యాంక్ ఉన్నతాధికారులు కుటుంబసమేతంగా పూజలు జరుపుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురంవద్ద వేదపండితులతో స్వాగతం పలికారు.బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ రుద్ర, జనరల్ మేనేజర్ శ్రీనివాసకుమార్, ఎజిఎం సోమంచి, రీజినల్ హెడ్ ఎల్‌విఎస్‌ఆర్ శర్మలు శివయ్య సన్నిధిలో పూజలకు హాజరయ్యారు. వారిని సాదరంగా ఆహ్వానించి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనాలు ఏర్పాటు చేసారు. తరువాత స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు.వారికి ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఆలయ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి, ఎపిఆర్‌ఓలు రవి,శేఖర్, స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్లు శేఖర్‌రెడ్డి, హరికృష్ణ,మార్కెటింగ్‌మేనేజర్ యోగానంద వారి సిబ్బంది స్వాగతం పలికారు.

## వరదరాజస్వామి ఆలయ పనులు త్వరగా పూర్తి చేయండి:

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రసన్నవరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాతృమూర్తి, సతీమణి బొజ్జల రిషితా రెడ్డిలు సూచించారు.మంగళవారం ఇరువుగు ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వరదరాజస్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. బాలాలయం వద్ద ఆలయ పూజారి శ్రీనివాసశర్మతో చర్చించారు.ఆలయ ప్రాశస్త్యం,ప్రాధాన్యత గురించి పూజారి వారికి వివరంచారు. ఈ సందర్బంగా వార్డుకు సంబంధించిన తెలుగుదేశం నాయకుడు కిట్టు, స్థపతి కుమార్‌లతో చర్చించారు. ఆలయ నిర్మాణం సుమారు 5 సంవత్సరాల నుంచి సాగుతుంది. ఇంకెంత కాలానికి పూర్తి అవుతుందని ప్రశ్నించారు.త్వరలోనే శ్లాబ్ స్థాయికి వస్తుందని వివరించారు.

## పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి:ఉపాధ్యాయుల్ని ఆదుకోవాలి



***శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త*** ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పిఆర్‌సిని వెంటనే ప్రకటించి ఉపాధ్యాయుల్ని ఆదుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. మంగళవారం యుటిఎఫ్ ప్రచార జాత ఏర్పేడు మండల కేంద్రంలో పర్యటించింది. ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023జూలై నుంచి ఉపాధ్యాయ ఉద్యోగులకు చెల్లించాల్సిన పిఆర్‌సికి సంబంధించి కమిటిని నియమించి ప్రకటించాలన్నారు.అంతవరకు తాత్కాలికంగా మధ్యంతర భృతిని మంజూరుచేయాలన్నారు. పిఆర్‌సి కమిటిని ఏర్పాటు చేసినప్పటికి ఆ కమిటి రాజీనామా చేయటంతో ప్రస్తుతం ప్రభుత్వ పెద్దలు తాము అధికారంలోకి వస్తే మెరుగైన పిఆర్‌సితోపాటు ఆర్థిక ప్రయోజనాలు చేకూరే నిర్ణయాలు తీసుకుంటామన్నారు.కానీ 15 నెలలు గడచినా ఉపాధ్యాయులకు ఇచ్చిన మాటను పట్టించుకోలేదన్నారు.దీంతో పాటు ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన నాలుగు విడతల కరువు భత్యాన్ని,ఆర్థిక బకాయిలను చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమాల్లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎస్ నాయుడు ,జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, మణికంఠన్, రామచంద్రయ్య, మధు,నిర్మల,ఏర్పేడు మండల నాయకులు గురువారెడ్డి,రాధాకృష్ణ,మునిరత్నం, సుధాకర్,రమేష్,హరినాథ్,గణేష్, సుబ్రమణ్యం,మురళి,రజియా తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జిల నిరసన



**తొట్టంబేడు,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంలో బోర్డు నిర్లక్ష్యవైఖరికి నిరసనగా మంగళవారం విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు.డిస్కం జాయింట్ యాక్షన్ కమిటి పిలుపు మేరకు తిరుపతి రూరల్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల జేఏసి చైర్మెన్ ఏ.మునస్వామి(శ్రీకాళహస్తి) సారధ్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్బంగా చైర్మెన్ మునస్వామి మాట్లాడుతూ 01.02.1999 నుంచి 31.08.2004 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేసారు. జేఎల్ఎం గ్రేడ్ 2 వాళ్ళను తక్షణమే క్రమబద్ధీకరించాలని, ఇంజనీరింగ్ మరియు డిగ్రీ కల్గిన జూనియర్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనర్లకు వెంటనే పదోన్నతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఎఏఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కారుణ్య నిమకాలు వెంటనే అమలు చేయాలన్నారు. జేఏసినాయకుడుబాబుమాట్లాడుతూసమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను వెంటనే చెల్లించాలని క్షేత్ర స్థాయిలో ఉన్న అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ ఆందోళన నల్లబ్యాడ్జిలు ధరించిన కార్యక్రమాల్లో కార్మికులు బి.మునిసుందరం, గుర్రప్ప, ఆనంద్, లక్ష్మీకాంత్, మల్లికార్జున, సురేష్;మునికుమార్, ఎం.సతీష్, కామాక్షయ్య, మునికిషోర్, గంగాధరం, దిలిప్, రాజేష్, రమేష్, ఎస్‌కె తమీమ్ హిమానియల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి జన్మదిన వేడుకలు

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదినం సందర్బంగా మంగళవారం శ్రీకాళహస్తిలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో నాయకులు సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంత్రి పేర పూజలు జరిపించారు. డాక్టర్లు, నర్సులు,బిజెపి నాయకులతో కలసి కోలా ఆనంద్ రోగులకు పండ్లు,బ్రెడ్ బిస్కట్లుఅందించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, ఆసుపత్రి అభివృద్ది కమిటి సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు, పార్టీ నియోజకవర్గంలోని నాయకులు హరీష్‌రెడ్డి, వేదం కృష్ణయ్య, భగీర్తి వెంకటేష్, కోనేటి అయ్యప్ప, అబ్బూరు పుల్లమనాయుడు, కూనాటి నాగరాజు,లింగాబత్తిని గోపాల్,అమర్‌నాథ్, పుణ్యం డిల్లి కుమార్, కన్నా వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శులు చందు రాయల్, పట్టణ యువమోర్చా అధ్యక్షులు తానికొండ భరత్‌నాయుడు, సజ్జా హరిష్,నారాయణ,గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ పాఠశాల విద్యార్థులు ఎస్ జి ఎఫ్ ఐ పోటీల కి ఎంపిక



**తిరుపతి విద్య సెప్టెంబర్ 16 ప్రభాత వార్త:** మండల స్థాయి పోటీలలో అండర్ 14 చేస్ విభాగంలో ఎయిర్ బైపాస్ రోడ్ నందు గల నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు గౌతమీ,ఆస్మిత మొదటి, రెండవ స్థానాలు సాధించి జిల్లాస్థాయి ఎస్ జి ఎఫ్ ఐ పోటీలకు ఎంపికయ్యారు.వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక శారీరక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు.క్రీడలలో పాల్గొనడం వలన సమాజంలో ఇతరుల పెద్దలతో ఎలా మెలగాలో సమాజం పట్ల ఎలా నడుచుకోవాలో వివిధ వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలో అన్ని విధాలుగా పరిపూర్ణ వ్యక్తిత్వం గల వ్యక్తిగా అభివృద్ధి చెందగలరు అని తెలిపారు.విద్యార్థులను తిరుపతి నారాయణ విద్యా సంస్థల యాజమాన్యం డి.జి.యం కొండల రావు, ఎ.జి.యం శ్రీనివాసులు, ఆర్ .వి వసంత కుమార్, ప్రిన్సిపాల్ షాహిద్ భాషా వీరిని అభినందించారు.

## ఘనంగా ఎస్ వి పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవం



***తిరుపతి విద్య సెప్టెంబర్ 16 ప్రభాత వార్త:*** శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమాన్ని టాట్ అసోసియేషన్ సహకారంతో సివిల్ ఇంజనీరింగ్ విభాగం మరియుఎన్.ఎస్.ఎస్.యూనిట్ సంయుక్తంగా నిర్వహించా యి. వారు మాట్లాడుతూ భారతరత్న మొక్ష గుండం విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకుని,యువతలో ఇంజనీరింగ్ రంగం పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకలో టాప్ట్ అధ్యక్షులు ప్రసాద రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. వై.ద్వారకానాధ రెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. వై. సుజాత, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి పి. రాజ మోహన్ రెడ్డి,ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## డిసిఎంఎస్ జిల్లా చైర్మన్



### "పల్లినేని" సుబ్రమణ్యం నాయుడు "కన్నుమూత"
### పార్టీలకతీతంగా అందరిలోనూ దిగ్భ్రాంతి

**చంద్రగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లా డిసిఎంఎస్ చైర్మన్, టిడిపి చంద్రగిరి మండల మాజీ అధ్యక్షుడు పనపాకంకు చెందిన పల్లినేని సుబ్రమణ్యం నాయుడు అనారోగ్యంతో కన్నుమూశారు. చంద్రగిరి మండలంలో అందరివాడుగా మన్ననలు అందుకున్న పల్లినేని మృతి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. టిడిపి మండల అధ్యక్షుడుగా పార్టీని సమర్థవంతంగా నడిపి, నాయకులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి గతంలో ఏ పార్టీకి లభించనంతటి మెజార్టీని మండలంలో తీసుకొచ్చిన ఘనత పల్లినేనికే దక్కింది. ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్య సమస్యతో వేలూరు సిఎంసిలో వైద్య చికిత్సలు పొందుతూ, మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. అనారోగ్యం బారినపడి మృత్యువుతో పోరాడి ఓడిన పల్లినేని మంగళవారం వేకువజామున తనువు చాలించారు. పనపాకం చేరుకున్న పల్లినేని భౌతికకాయానికి ముందుగా కుటుంబ సభ్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఎల్ఏ పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ నా సోదరుడు పల్లినేని మనమధ్య లేకపోవడం జీర్ణించుకోలేకపోతున్నట్లు గద్గద స్వరంతో అన్నారు. రాజకీయ రంగంలో టిడిపికి, క్యాకర్తలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. జిల్లాలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు ఇక్కడికి చేరుకుని నివాళులర్పించారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పనపాకంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## "స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్"

సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు

**చంద్రగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సిహెచ్‌సి (చంద్రగిరి ఏరియా ఆసుపత్రి) సూపరిండెంట్ డాక్టర్ అరుణ, చంద్రగిరి మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ తెలిపారు. ఈ మేరకు వైద్యాధికారులు మంగళవారం వేర్వేరుగా వివరాలు వెళ్ళడించారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు రెండు వారాల పాటు ఆరోగ్య వంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబం (స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్) అనే నినాదంతో సమగ్ర ఆరోగ్య ప్రచార్, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు సమయానుకూలంగా వైద్య సేవలందించడం ద్వారా ఆరోగ్యవంతమైన మహిళ అభివృద్ధి చెందిన సమాజానికి ఆధారం కాగలదన్నారు. ఈ కార్యక్రమాన్ని నిపుణులైన వైద్య సిబ్బందిచే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించబడతాయన్నారు. ఇందులో భాగంగా మహిళల్లో రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, కిషోర్ బాలికలకు ఆరోగ్య పరీక్షలు, అనీమియా, క్షయ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని అన్నారు. రెండు వారాలు పాటు మహిళల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భవిత కేంద్రం దివ్యాంగులకు మెడికల్ క్యాంప్



***చంద్రగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:*** స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల కొరకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. శ్రీపద్మావతి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలను నిర్ధారించడం కొరకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌కు 5 మండలాలకు చెందిన దివ్యాంగుల పిల్లలు, వారి తదల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలను పరీక్షించిన వైద్యులు ఉపకరణాల కొరకు సిఫార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.సి.గౌరీశంకర్ రావు, సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి, ఏఎల్ఎస్ఓ చంద్రశేఖర్ నాయుడు, సిఎంఓ సురేష్, ఏఎస్ఓ సుధాకర్ నాయుడు, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్‌బాబు, హైస్కూల్ హెచ్‌ఎం పి.వెంకటరమణ రెడ్డి, ఐఈడిఎస్ఎస్ కె.ఉదయ్‌కుమార్, ఐఈఆర్‌పిలు ఎన్.వెంకటరాజేశ్వరి, ఎస్.శ్యామలాదేవి, ఎం.మునికృష్ణారెడ్డి, పి.హేమలత, కె.మనోహర్, కె.నవీన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి..!

### కుప్పం బాదూరు వైద్యాధికారి డాక్టర్ తేజేశ్వరి

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:**



నేటి నుండి 29వ తారీఖు సోమవారం వరకు కుప్పం బాదూరు పిహెచ్‌సి పరిధిలో నిర్వహించే ప్రభుత్వ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కుప్పం బాదూరు వైద్యాధికారి డాక్టర్ తేజేశ్వరి కోరారు. మంగళవారం పిహెచ్‌సిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వస్త్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, నారాయణాద్రి హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, కిషోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, అనీమియా, క్షయ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని అన్నారు. 17న కుప్పం బాదూరు, 18న మిట్టకండ్రిగ, 19న నెత్త కుప్పం, 20న అనుపల్లి, 26న బాలినాయుడు కండ్రిగ, 27న అప్లాయిగుంట, 29న సి.కె.పల్లి ఆరోగ్య ఉప కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రజలుసద్వినియోగం చేసుకో వాలని కోరారు.

## మన డబ్బులు, మన లెక్కలు యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి..!




***రామచంద్రాపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:*** మన డబ్బులు, మన లెక్కలు యాప్‌ను మహిళా సంఘాల సభ్యులు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపిఎం గురుమూర్తి సూచించారు. మంగళవారం సి.రామాపురంలో మహిళా సంఘాల సభ్యులతో కలసి మన డబ్బులు, మన లెక్కలు యాప్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ యాప్ నందు సంఘం వివరాలు, సభ్యుల వివరాలు, వారి పొదుపులు, అప్పులు, చెల్లించిన వాయిదాలు, నిల్వ వున్న అప్పుల వివరాలు ప్రతి సభ్యురాలికి తెలియజేస్తుందన్నారు. మహిళలు లెక్కలు స్వయంగా చూసుకుని ఎవరి వద్ద మోసపోకుండా ప్రభుత్వం ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. గ్రామ సమాఖ్య లీడర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన టైలర్ కుమార్తె



### నిరుపేద కుటుంబం నుంచి డాక్టర్ కల సాకారం చేసిన వైష్ణవి

**కేవీబీ పురం, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** తండ్రి టైలర్ పని, తల్లి కూలీపనులకు వెళ్లితే కానీ పూట గడవని ఓ సాధారణ కుటుంబంలో పుట్టి పెరిగిన వైష్ణవి తన కష్టాన్ని పట్టుదలని అడ్డుకట్ట చేయకుండా ముందుకు సాగింది. నిరుపేద కుటుంబ పరిస్థితులు, విద్యా భ్యాసంలో ఎదురైన ఇబ్బందులు అన్ని తట్టుకుని ప్రభుత్వ పాఠశాల ల్లోనే చదువుకుని, డాక్టర్ కావాలన్న తన కలను సాకారం చేసుకుంది. తాజాగా విడుదలైన నీటి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించి అందరికి స్ఫూర్తిదాయకమైన విజయగాధగా నిలిచింది. వివరాలు ఇలా... కేవీబీ పురం మండలం రాయపేడు గ్రామానికి చెందిన కారణి జనార్ధన్, మునిలక్ష్మి దంపతుల కుమార్తె కరణి వైష్ణవి చిన్నప్పటి నుంచి చదువుపై ఉన్న మక్కువను గమనించిన తల్లిదండ్రులు కూలీనాలీ చేసి కష్టపడి చదివిస్తూ వచ్చారు. ఇంటర్‌లో 977 మార్కులతో నీటి పరీక్షలకు హాజరై 471 మార్కులు సాధించి ఆలిండియా ర్యాంకు 90,122, రాష్ట్ర ర్యాంకు 3,232 సాధించి తిరుపతిలోని పద్మావతి కళాశాలలో మొదటి కౌన్సిలింగ్‌లోని ఉచిత ఎంబీబీఎస్ సీట్లు దక్కించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని మాట్లాడుతూ పట్టుదలతో కృషి చేస్తే సాధించలేని కల ఏదీ ఉండదు అని తెలిపింది. అలాగే వైద్యురాలు అయిన తరువాత నిరుపేదలకు ఉచిత వైద్యం అందించడమే తన ధ్యేయ మని వివరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా ఉన్నత శిఖరాలను చేరవచ్చని చూపిన వైష్ణవి విజయగాధ పల్లెలో చదువుతున్న విద్యార్థులకు కొత్త ఆశలు కలిగిస్తోంది. కష్ట నష్టాలు ఎంత ఉన్నా, లక్ష్యంమీదదృష్టిపెట్టికృషి చేస్తే వైష్ణవి లాంటి విజయాలు అందరికి సాధ్యమేనని గ్రామస్తులు అంటున్నారు.

## విద్యుత్‌శాఖ ఎఇఇ హఠాన్మరణం



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి విద్యుత్ శాఖలో ఎఇఇగా పని చేస్తున్న కూరపాటి హిమతనయ హఠాన్మరణం చెందారు.ఆమె మృతికి విద్యుత్ శాఖ అధికారులు తమ సంతాపాలను తెలిపారు. శ్రీకాళహస్తి విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎఇఇగా పని చేస్తున్న హిమతనయ మరణం తీరని లోటు అని అధికారులు సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టణంలోని దక్షిణ కైలాస్‌నగర్‌లో ఆమె నివాసముంటున్నారు.

# తిరుపతి డివిజన్

## ఐక్యంగా ఉంటే బలిజలు మరింత అభివృద్ధి



**తిరుపతి హెల్త్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని బలిజలు అందరూ ఐక్యమత్యమే మహా బలం అన్న విధంగా ఐక్యంగా ముందుకెళ్ళినప్పుడే అభివృద్ధి పథంలో ముందు కెళ్ళగలమని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఓ ప్రైవేట్ హోటల్‌లో బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అధ్యక్షతన బలిజ సేన రాష్ట్ర స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బలిజలందరూ ఒక్కతాటిపై ఉంటూ ఒకరినొకరు సహకరించుకుంటూ ముందుకెళితే బాగుంటుందన్నారు. 2024లో తాను ఎమ్మెల్యేగా అఖండా మెజార్టీతో గెలవడానికి బలిజ కుటుంబాల ప్రజలు, మహిళలు, యువత చేసిన కృషిని గుర్తు చేశారు. కూటమి హయాంలో బలిజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మరింత ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం బలిజ రాష్ట్ర కార్యవర్గానికి పుష్పగుచ్ఛం, శాలువతో ఘనంగా సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, ఉపాధ్యక్షులు రాయని రమేష్, మస్తాన్ రాయల్, సంయుక్త కార్యదర్శి గీతాంజలి, రమణ, రెడ్డి రాణి, కో-ఆర్డినేటర్ రామకృష్ణ, యువత అధ్యక్షుడు అనంతరాయల్, ప్రతినిధులు నరసింహ, దుమ్ము రాయల్, కిరణ్‌బాబు, శివ, మురళీ, హరీష్, ప్రసాద్, అనూష, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మోక్షగుండం సేవలు ఆదర్శనీయం



తిరుపతిరూరల్,సెప్టెంబర్16 ప్రభాతవార్త: సమాజ అభివృద్ధిలో మోక్షగుండం విశ్వేశ్వరాయ సేవలు ఆదర్శనీయం, ప్రశంసనీయమని భారతి సిమెంట్ ప్రతినిధి విజయ్ వర్ధన్‌రెడ్డి తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతిని పురస్కరించుకుని సోమవారం గంధమనేని శివయ్య, క్రిష్ణారెడ్డి భవన్‌లో ఇంజనీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ భారత ఇంజనీరుగా మోక్షగుండం విశ్వేశ్వరాయ అనేక నిర్మాణాత్మక పనులను చేసి ప్రజల మదిలో శాశ్వితంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ చైర్మెన్ సి.ఆర్.రాజన్, తుడ సిపిఓ దేవీకుమారి, యాదవ కార్పోరేషన్ చైర్మెన్ నరసింహయాదవ్, గంగమ్మగుడి చైర్మెర్ మహేష్ యాదవ్, టెప్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రెడ్డి, టి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**విజయపురం, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో ప్రవేశానికి 4వ విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.భైరవుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలోని వివిధ ట్రేడ్లలో మిగిలిన సీట్లకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబరు 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఐటీఐలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సెప్టెంబరు 29 తేదీ జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో విజయపురం ఐటీఐ కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. ఎటువంటి ఇంటర్వ్యూ కార్డులు పంపబడవన్నారు.

## క్రీడా పోటీతోనే ప్రగతి : ఎంఈవో



***సత్యవేడు, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:*** ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లో కూడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సత్యవేడు ఎంఈవో రవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఆయన మండల స్థాయి స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆటలు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వారి వారి అభిరుచికి తగ్గట్టు క్రీడలను ఎంచుకోవాలన్నారు. క్రీడ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టినట్టు ఆయన గుర్తు చేశారు. కేవలం మండల స్థాయికి పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో కూడా పోటీ పడేడట్టు విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఆయా పీఈటీ మాస్టర్లపై ఉందన్నారు. ప్రతి రోజు విద్యార్థులు ఆటల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. అంతకు ముందు ఎంఈవో-2 ఉషతో కలసి ఎంఈవో రవి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కబడ్డీ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్‌లకు సంబంధించి విన్నర్‌గా బాలుర గురుకుల పాఠశాల, వాలీబాల్ పోటీలో జూనియర్స్‌లో విన్నర్స్‌గా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల,సీనియర్స్‌లో దాసుకుప్పం జడ్పీ హైస్కూలు విన్నర్స్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు పీఈటీ మాస్టర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ ఎఫ్ తో పేదలకు ఊరట



**తిరుపతి విద్య సెప్టెంబర్ 16 ప్రభాత వార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన కార్యాలయంలో మంగళవారం అందించారు. ఎంఆర్ పల్లికి చెందిన మునిరాజుకు ఐదు లక్షలా పదహారు వేలు, రాజీవ్ నగర్ కు చెందిన సుధాకర్ కు రెండు లక్షలా రెండు వేల ముప్పయ్ నాలుగు రూపాయలు,భవానీనగర్ కు చెందిన భాగ్యమ్మకు ముప్పయ్ వేల రెండు వందల తొంభైఆరు రూపాయలు, రాజీవ్ గాంధీ కాలనీకి చెందిన రమేష్ కు నలభై రెండు వేల ఐదు వందల రూపాయలు,శివజ్యోతి నగర్ కు చెందిన జోతీశ్వర్ రెడ్డికి నలభై మూడు వేల ఎనిమిది వందల ఇరవై నాలుగు రూపాయల చెక్కును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు.రాష్ట్రంలోని పేద,బడుగు,బలహీన వర్గాలకు ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు.ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి,కొండా రాజ్ మోహన్,ముని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాలలో విజయోత్సవ ర్యాలీ



***తిరుపతి విద్య సెప్టెంబర్ 16 ప్రభాత వార్త:*** జాతీయస్థాయి సంవిధాన్ పే చర్చా 2025 మూట్‌కోర్ట్ పోటీల్లో తిరుపతి అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఫస్ట్ రన్నరప్ బహుమతితో పాటు క్యాష్ అవార్డును సాధించారు.ఈ విజయం సందర్భంగా మంగళవారం కళాశాల విద్యార్థులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.కళాశాల చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్మయి, సాహితీ, హర్షిత పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి,జాతీయస్థాయిలో కళాశాల పేరును నిలబెట్టినందుకు గర్వంగా అని తెలిపారు.దేశవ్యాప్తంగా 110 విశ్వవిద్యాలయాలు పాల్గొన్న ఈ పోటీల్లో అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాల రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి జీవితంలో కష్టపడి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు అధ్యాపక బృందం పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా స్వాగతం పలికారు.ముఖ్య అతిథులుగా విచ్చేసిన లా కమిషన్ ఆఫ్ ఇండియా ఛైర్పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిసింగ్,మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయకుమార్ శుక్ల చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. రీసెర్చ్ టెస్ట్ విభాగంలో విద్యార్థిని హర్షిత సెకండ్ ప్రైజ్ను గెలుచుకున్నారు. ప్రిన్సిపల్ బిజయ కుమార్ బెహరా , మూట్ కోర్టు కమిటీ సెక్రటరీ లక్ష్మీప్రశస్త,టి ఆర్ జూలీమోల్,రేష్మి, అతిర, విష్ణు వందన,అక్షయ్ మిడిల్ టోన్,కార్తిక, స్వగతిక పనిగ్రాహి, శుభమస్తు పాండా, శ్యామలాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా యాత్రి సేవా దినోత్సవం...

***రేణిగుంట సెప్టెంబర్ 16 ప్రభాతవార్త***



దేశవ్యాప్తంగా బుధవారం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా భారీ ఎత్తున యాత్రి సేవా దినోత్సవం (యాత్రి సేవా దివస్) నిర్వహిస్తున్నట్లు రేణిగుంట (తిరుపతి) అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ భూమి నాథన్ తెలిపారు. రేణిగుంట ఎయిర్‌పోర్ట్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ సమావేశ భవనం నందు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో భూమి నాథన్ మాట్లాడుతూ రేణిగుంట విమానాశ్రయం అంచలంచెలుగా అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. ప్రతిరోజు దాదాపు 17 నుండి 19 విమాన సర్వీసులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయన్నారు. శ్రీవారి పాదపద్మాల చెంత విమానాశ్రయం ఉండడంవల్ల అభివృద్ధికి కొదవ లేదన్నారు. విమానాశ్రయం దాదాపు అంతర్జాతీయ ప్రమాణాలను సంతరించుకుందన్నారు. ఈ మధ్యకాలంలో విదేశీ విమానాలు కూడా ల్యాండ్ అయినట్టు చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యాలను అందించడంలో విమానాశ్రయ సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించారు. విమానాశ్రయ పరిసర ప్రాంతాలను పచ్చదనం ఉట్టిపడేలా చేస్తున్నామన్నారు. 17వ తేదీ బుధవారం జాతీయస్థాయిలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చేపట్టిన యాత్రి సేవా దివస్ విజయవంతం అయ్యేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏర్‌పోర్ట్ అధికారులు తిరుపతి ఎస్వి సంగీత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించే విధంగా ఉంటాయన్నారు. రోటరీ క్లబ్ తో అనుసంధానమై రక్త సేకరణ క్యాంపులు, ప్రయాణికులకు బిపి, షుగర్, సిబిపి పరీక్షలు, ఉచిత కంటి పరీక్షల క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ మేనేజర్ మణిదీప్, సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ కశ్యప్, ఆపరేషన్ మేనేజర్ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

రేణిగుంట సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



భారతీయ సనాతన ధర్మంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన విశ్వకర్మ జయంతిని జాతీయ సెలవు దినం గా ప్రకటించాలని బి ఎం ఎస్ నాయకుడు, బిజెపి యువనేత వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. ఎంతోమంది కులవృత్తులు చేసుకునేవారు విశ్వకర్మను ఆరాధ్యునిగా భావిస్తారన్నారు. ముందుగా ఆయన కు పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరమే కుల వృత్తులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కళాకారులు అందరి పూజలు అందుకుంటున్న విశ్వకర్మ జయంతిని జాతీయ లేబర్ డే గా ప్రకటించడమే కాకుండా సెలవు దినం చేయాలన్నారు.

# ప్రభుత్వ విధానాలతో... ప్రైవేట్ పాఠశాలల బాటపడుతున్న విద్యార్థులు

**- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్**



వెంకటగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార: రాష్ట్ర ప్రభుత్వ విధానంతో లక్షలాది మంది విద్యార్థులు ప్రవేట్ పాఠశాలల బాటపడుతున్నారని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) వివిధ ఉపాధ్యాయ విద్యారంగ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రణభేరి ప్రచార బైక్ జాతా ర్యాలీ నిర్వహించారు. వందలాది బైక్‌లతో జరిగిన ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో చేసిన ప్రయోగాలు దుష్పరిణామాలకు దారి తీయడంతో వాటిని సరిదిద్దాలని ఈ ప్రభుత్వానికి మొర పెట్టుకోగా, ఈ ప్రభుత్వం కూడా నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలను పునర్వ్యవస్థదించడం వల్ల పాఠశాల వ్యవస్థలో 9రకాలైన పాఠశాల ఆవిర్భవించాయని తెలిపారు. దీని పర్యవసానంగా అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారడంతో పాటు, మూడు లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లడం జరిగిందని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా అనేక రకాల యాప్లతో ప్రభుత్వం వేదిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియమించిన పి ఆర్ సి కమిటీ నిర్వీర్యమైందని, ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు పిఆర్సి కమిటీకి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదనిన్నారు. స్థానిక యూటీఎఫ్ నాయకులు, జిల్లా సహాధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యా యులకు ఇప్పటివరకు నాలుగు విడతల కరువు భత్యం మంజూరు కాకుండా పెండింగ్లో ఉన్నదనిన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, సీనియర్ నాయకులు ఉదయకుమార్, వయ్యాల మధు, జిల్లా కార్యదర్శి ఆదినారాయణ తోపాటు వెంకటగిరి యూటీఎఫ్ సీనియర్ నాయకులు, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రిటైర్డ్ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను మంగళవారం మంత్రి మిత్రబృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబూరు చంద్రయ్య, చెంచుకృష్ణ, ఎలిమేటి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక మీదట బయోమెట్రిక్ ద్వారానే రుణాలు



కోట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: ఇక మీదట పొదుపు సంఘాల సభ్యులకు బయోమెట్రిక్ విధానం ద్వారానే రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఎపిఎం అనిల చెప్పారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో 37 మంది విఓఎలకు బయోమెట్రిక్ డివైజ్‌లను ఎజిఎం హేమంత్‌కుమార్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి, ఇతర రుణాలు అన్నీ ఇక మీదట బయోమెట్రిక్ ద్వారానే ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు ప్రసాద్, శంకర్, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే రేషన్ డీలర్లకు ఈ-పోస్ యంత్రాలు పంపిణీ

కోట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: జిల్లాలోని చౌకధరల దుకాణాల డీలర్లకు స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలు వచ్చాయి. ఇటీవల లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్‌కార్డుల వినియోగానికి వీలుగా ఈ యంత్రాలు పనిచేస్తాయి. డీలర్ల వద్ద ఉన్న పాతయంత్రాలను తీసుకుని త్వరలో కొత్తవాటిని పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. స్మార్ట్‌కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం, లేదా స్వైపింగ్ చేయడం ద్వారా కార్డుదారుని కుటుంబ సభ్యుని వివరాలు డిస్‌ప్లే అవుతాయి. టీచ్ స్క్రీన్ కావడంతో వినియోగించేందుకు వీలుగా ఉంటుంది. పిన్‌కార్డు ద్వారా పనిచేస్తుంది. బరువు తక్కువగా ఉండటం వలన ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు. అక్టోబర్ నెల నుంచి కొత్త ఈ-పోస్ యంత్రాలతో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు అవకాశం ఉందని సంబంధిత అధికారి తెలిపారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈవో



డక్కిలి,సెప్టెంబరు 16ప్రభాతవార్త;డక్కిలి మండలంలోని మోపూరు ఉన్నత పాఠశాల, మోపూరు రోడ్డు ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్కూల్ రికార్డులను, మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు.

## డ్రోన్ కెమెరా ద్వారా గట్టిగా నిఘా : సిఐ

వెంకటగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: డ్రోన్ కెమెరా ద్వారా పట్టణంలో గట్టి నిఘ పెట్టామని సిఐ ఏవి రమణ తెలిపారు. పట్టణంలోని హ్యాండ్ లూమ్ టెక్సాల వద్ద డ్రోన్ కెమెరా చెట్ల మధ్యలో తిరుగుతున్న వారిని గుర్తించామని తెలిపారు. డ్రోన్ కెమెరా ద్వారా అపరిచిత వ్యక్తులు కూడా గుర్తిస్తామని చెప్పారు. డ్రోన్ కెమెరా ఎగరవేసి అన్ని కదలికలకు తెలుసుకుంటామని తెలిపారు.

## విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన

వెంకటగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు భూసార పరీక్షా కేంద్రం తిరుపతి జిల్లాకు చెందిన వ్యవసాయ అధికారులు పుష్పావతి,కళ్యాణ్ బాబు, మండల వ్యవ సాయ అధికారిని పి.సుజాత జిల్లా వనరుల కేంద్రం తిరు పతి జిల్లాకు చెందిన వ్యవసాయ అధికారి శ్రీనివాసులు, కెవికె శాస్త్రవేత్త డాక్టర్ రాజీవన భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నందు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ తులసి జ్యోతి, ఉపాధ్యాయులు, వివిఏజీ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిర్వాహకులు వైన్ షాపు ఫీజులు చెల్లించండి



వాకాడు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: వాకాడు ఎక్సైజ్ సర్కిల్లో ఉన్న వైన్ షాపు నిర్వాహకులు ప్రభుత్వంనకు ఫీజులు నెలాఖల్లోపు చెల్లించాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస చారి తెలిపారు. మంగళవారం వాకాడు ఎక్సైజ్ కార్యాలయాన్ని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసచారి, జిల్లా ఎక్సైజ్ సూపరైంట్ నాగ మల్లేశ్వర్‌రెడ్డిలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీనివాసచారి మాట్లాడుతూ ఎక్సైజ్ సర్కిల్లోని ఉన్నటువంటి 17 వైన్ షాపులు ప్రభుత్వం నిబంధన ప్రకారం ఒక సంవత్సరం పూర్తయి, రెండవ సంవత్సరం నుంచి మొదటి విడతగా వైన్స్ షాప్లకు సంబంధించి ఫీజులతో పాటు, పర్మిట్ రూము కూడా ఫీజు వైన్ షాప్ దారులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వాకాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్‌యువి ప్రసాద్, ఎస్సై రషీద్, సిబ్బంది రాజయ్య, రమణయ్య పోలయ్య, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## భారీ వర్షంతో వరి పంటకు అపార నష్టం



బాలాయపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: మండలంలో వర్షానికి వరి పైరు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి పంట చేతికి అందుతున్న దశలో వర్షం పడి పంట దెబ్బతినిందని రైతులు అయిపోయారు. మరో నాలుగు ఐదు రోజుల్లో వరి కోత దశలో ఉండగా వర్షం పడినట్లు తెలిపారు. మండలంలోని వెంగమాంబపురం, అక్కసముద్రం తదితర గ్రామాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది.

## తీర ప్రాంత గ్రామాలలో ఈ క్రాప్ పరిశీలన



వాకాడు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: మండలంలోని తీర ప్రాంతాల్లో మంగళవారం తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ వేరుశనగ పంటను ఈక్రాప్ సూపర్ చెకింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలం లోని పూడి రాయదొరువు, మొన పాలెం, రావిగుంటపాలెం, పంబలి, మూలపడవ నలగామాల, నిడుగుర్తి, శ్రీపురం గ్రామాలలో ఖరీఫ్ 2025కి సంబంధించిన పంట బుకింగ్ నందు వ్యవసాయ విలేజ్ సహాయకులు ద్వారా డేటాను సూపర్ చెకింగ్‌కు వాకాడు తహశీల్దార్ ఈ క్రాప్ సర్వే చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఎం శ్రీనువాసులు, డిజిటల్ అసిస్టెంట్ హర్షవర్ధన్, సందీప్‌లు పాల్గొన్నారు.

## జెండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



గూడూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: జెండా పండుగను ప్రశాంతంగా జరుపు కోవాలని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. రెండో పోలీస్ స్టేషన్ పరిధిలో జెండా పండుగ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండా పండుగ నిర్వహించదలచిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పోలీస్ అనుమతి పొందాలన్నారు. డీజేలు వినియోగించ రాదు, బాణసంచా కాల్చరాదన్నారు. ఊరేగింపులో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. రౌడీషీటర్లు జాగ్రత్తగా ఉండాలనీ ఊరేగింపు సందర్భంగా గొడవలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపడతామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

## పి4 కార్యక్రమంపై సమీక్ష



గూడూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పి4 కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, ధనికులు మధ్య అంతరం తగ్గించడమే పి4 లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరు పి4పై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ చోరీ గద్దే ఛోడోపై 20న సంతకాల సేకరణ



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: కాంగ్రెస్ నేతల పిలుపు దేశంలో ఓటు చోరీకి పాల్పడున్న ఎన్నికల కమిషన్, బీజేపీ తీరును ఎండగడుతూ ఈనెల20వ తేదీన తిరుపతి లో చేపడుతున్న ప్రజాసంతకాల సేకరణ కార్యక్రమంమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేతలు పిలుపు నిచ్చారు. తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అధ్యక్షతన తిరుపతి జిల్లా ముఖ్య నేతల సమావేశం మంగళవారం గెస్ట్ లైన్ డేస్ హోటల్ రోడ్డులోని కన్వెన్షన్ హాల్లో జరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర కమిటీ సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాలో అక్రమాలపై సమీక్షించారు. ఈసందర్భంగా గౌడపేరు చిట్టిబాబు అధ్యక్షోపన్యాసం చేస్తూ దేశంలో ప్రజాస్వామ్యం రోజు రోజుకు దిగజారిపోతోందని అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చట్ట, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పీసీసీ ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు మాట్లాడుతూ దేశంలో అధికారంలోకి రావడానికి బీజేపీ అడ్డమైన విధానాలు అనుసరిస్తోందని ఇందులో భాగంగానే ఓట్లు చోరీకి తెరలేపిందని విమర్శించారు. ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్ లు మాట్లాడుతూ నిజమైన దేశభక్తి కలిగిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఈకార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, పిసిసి ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఏఐసిసి ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, మాజీ పీసీసీ ప్రధాన కార్యదర్శి సుప్రజ,శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపామోదర్‌రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెంకటాచలపతి, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బాల్లా రవికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తూరు శివశంకర్, డిసిసి ప్రధాన కార్యదర్శి కళిందర్, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు ముషీనా బేగం, తిరుపతి సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తలారి గోపీచంద్, ఉపాధ్యక్షులు గొడుగు చింత గోపి, నాగరాజు యాదవ్, ఆర్గనైజేషన్ సెక్రెటరీ పవన్ కళ్యాణ్, తిరుపతి జిల్లా ఎస్‌టి విభాగం అధ్యక్షులు జ్యోతీశ్వర నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భోయన నరేంద్రబాబు, పిసిసి మాజీ బీసీ సెల్ కార్యదర్శి బయలు గోపి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా పని చేయండి: ఎంఎల్ఏ

**-శ్రీకాళహస్తి,ఏర్పేడు సింగిల్ విండోల ప్రమాణ స్వీకారం**



శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : కొత్తగా నియమితులైన సింగిల్ విండోల అధ్యక్షుల ప్రమాణస్వీకారాన్ని అ ంగరంగ వైభవంగా నిర్వహిం చారు. శ్రీకాళహస్తి మండలం లోని కాపుగున్నేరి సింగిల్ విండో అధ్యక్షులుగా సీనియర్ తెలుగుదేశం నాయకుడు వంకాయల పాటి బత్తిరెడ్డి, ఏర్పేడు సింగిల్ విండో అధ్యక్షులుగా కందాటి మహేష్‌రెడ్డిలను నియమిం చారు. ఇరువురి ప్రమాణ స్వీకారానికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ విండోలు రైతుల సమస్య పరిష్కారానికి వేదికలు అన్నారు. నేడు ప్రభుత్వం ఎన్నో వెసులు బాట్లు అందిస్తున్నారన్నారు.వాటిని సకాలంలో సక్రమంగా అందించ టంలో చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కుమార్, మార్కెటింగ్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు తాటిపర్తి రవీంద్రరెడ్డి,జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి, కామేష్‌యాదవ్, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు, మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకులు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, చెలికం పాపిరెడ్డి,అక్షింతల కృష్ణయాదవ్, జగదీశ్వర్‌రెడ్డిలు హాజరయ్యారు.

**ప్రమాణ స్వీకారం:**

కాపుగున్నేరి సింగిల్ విండో అధ్యక్షుడుగా బత్తిరెడ్డి, సభ్యులుగా రవీంద్ర, కూనాటి నాగరాజు,ఏర్పేడు మండల అధ్యక్షుడుగా మహేష్‌రెడ్డి, సభ్యులుగా కృష్ణవేణి,మునిశేఖర్‌లు ప్రమాణ స్వీకారం చేసారు. వారిని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సత్కరించారు.

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం

కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్స వాల చివరిరోజు మంగళవారం రాత్రి గణనాధునికి గ్రామోత్స వం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 21 రోజులు పాటు జరిగిన సా ్వమివారి వార్షిక బ్రహ్మోత్స వాలు మంగళవారం రాత్రి జరిగిన తెప్పోత్స వంతో ఘనంగా ముగిశాయి. తెప్పోత్స వం అనంతరం సా ్వమివారికి గ్రామోత్స వంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు తెప్పలపై విహరించి సేదతీరిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్స వమూర్తులకు తిరిగి గ్రామోత్స వంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉభయదారులు, వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పవిత్రోత్సవాలకు అంకురార్పణ



వడమాలపేట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి జరగనున్న పవిత్రోత్స వాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. పవిత్రోత్స వాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా మృత్స ంగ్రహణం, సేనాధిపతి ఉత్స వం, మేదిని పూజ నిర్వహించారు. పవిత్రోత్స వాల్లో మొదటి రోజు బుధవారం పవిత్ర ప్రతిష్ట, గురువారం పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు చేపడతారు. చివరి రోజు శుక్రవారం మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరగనుంది. పవిత్రోత్స వాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఉత్స వ మూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుభవం,అవగాహన కలిగిన ఈఓ సింఘాల్



తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఈఓగా గతంలో పనిచేసిన అనుభవం, అవగహన భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో, టిటిడిని ముందుకు నడిపించడంలో ఉపయోగ పడుతుందని టిటిడి పాలకమండలి సభ్యులు ఆకాంక్షించారు. ఈఓగా రెండవసారి నియమితు లవడంతో మంగళవారం బోర్డు సమావేశంలో చైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి,శాంతారాం పనబాకలక్ష్మి, సన్మానించారు.

## సేవాగుణం,ప్రజాశ్రేయస్సు మరువకూడదు

**-తుడ చైర్మన్ దివాకర్‌రెడ్డికి గవర్నర్ నజీర్ హితవు**

తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి: ఏ స్థాయిలో ఉన్నా సేవాగుణం, ప్రజాశ్రేయస్సు మరువకూడదని రాష్ట్రగవర్నర్ జస్టీస్ అబ్దుల్‌నజీర్ తుడ చైర్మన్ సి.దివాకర్‌రెడ్డికి సూచించారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయంలోపల తుడ చైర్మన్ దివాకంరెడ్డి గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఇద్దరూ కొంతసేపు సంభాషించుకున్నారు.



# గూడూరు డివిజన్

## స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం



గూడూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో 47వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ జెండాను స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కామ్రేడ్ డి.మల్లికార్జున ఆవిష్కరిం చారు. ఆయన మాట్లాడుతూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎలాంటి పరిస్థితులలో స్థాపించబడిందో గతంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మిక వర్గ పక్షపాతిగా ఆర్టీసీ పరిరక్షణ కోసం కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఎలాంటి ఐక్య ఉద్యమాల్ని చేసిందో వివరించారు. ఫెడరేషన్ జిల్లా సహాయ కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్టీసీలో ఎన్ని సంఘాలున్నా ఎన్ని జండాలున్నా అజండా మాత్రం ఒకటే ఉండాలని కార్మిక, ఉద్యోగ ప్రయోజనాల కోసం, ఆర్టీసీని పరిరక్షించేందుకు అన్నారు. అనంతరం డిపో మేనేజర్ పి.సిహెచ్.లక్ష్మి చేత డిపో గ్యారేజ్ ముందు పూల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్. డబ్ల్యూ.ఎఫ్ తిరుపతి రీజినల్ గౌరవాధ్యక్షులు డి. మల్లికార్జున్ సీనియర్ నాయకులు ఏం. శేషయ్య, కె.నారాయణ, కె.ఎస్. శ్రీనివాసులు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రఘురాం, డి. శ్రీధర్, గూడూరు పట్టణ సిఐటియు ప్రధాన కార్యదర్శి బివి రమణయ్య, ఆఫీస్ బేరర్స్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎసిఎస్ చైర్మన్ ప్రమాణస్వీకారం



పెళ్లకూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: చిల్లకూరు సహకార సంఘం చైర్మన్‌గా మండలంలోని రావులపాడు గ్రామానికి చెందిన కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడు (కె.వినాయుడు) నాయుడుపేటలోని శ్రీనివాస్ కళ్యాణ మండపం నందు మంగళ వారం నాడు సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశాడు. కె.వి నాయుడుకు చైర్మన్ పదవి రావడం పట్ల మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు గ్రామంలోని ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీ నాయుడు మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కారకులైన ఎమ్మెల్యే విజయశ్రీ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యంకి కృతజ్ఞతలు తెలిపారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



గూడూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త : డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజెపి, టౌన్ వెస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రీజన్ చైర్మన్ డాక్టర్ బి. కృష్ణమూర్తి, జోన్ చైర్మన్ టీ. శ్రీరంజనిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రీజన్ చైర్మన్ డాక్టర్ బి. కృష్ణమూర్తి కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు వేల రూపాయలు విరాళాన్ని, అలాగే జోన్ చైర్మన్ డాక్టర్ టీ.శ్రీరంజని కూడా ఐదు వేల రూపాయల విరాళాన్ని టైలరింగ్ క్యాంప్ చైర్మన్ లయన్ రవీంద్రరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ 2వ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.జె.ఎఫ్. లయన్ ఆర్.వి. రావు, చంద్రశేఖర్ రెడ్డి బండ్ల సుధాకర్ (ప్రెసిడెంట్), లయన్ పి. రాజేంద్ర ప్రసాద్ (వైస్ ప్రెసిడెంట్ -టౌన్), షేక్ ఇంతియాజ్ (వైస్ ప్రెసిడెంట్ - వెస్ట్ క్లబ్), లయన్ కావేరి (టైలరింగ్ ట్రైనర్), లయన్ కృష్ణకుమార్ (పాస్ట్ ప్రెసిడెంట్ సంగమిత్ర లయన్స్ క్లబ్ నెల్లూరు),లయన్ సుశీలాక్ష్మి, ఎస్.ఎల్.ఎన్. స్వామి, లయన్ రవీంద్రరెడ్డి, మురళి రాజు, వెంకటసుబ్బయ్య, వేణు రెడ్డి, బాబు రావు, చంద్రశేఖర్ రెడ్డి, హేమలత, ప్రభావతి, పరమజ్యోతి, భాస్కర్ రెడ్డి, ఆర్.రత్నం గౌడ్, పి. ప్రసాద్, హరికృష్ణ, సాయి లాబొరేటరీస్ మురళి, బి. నరేందరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ సెల్ ప్రొటెక్టర్‌గా మొహమ్మద్

గూడూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: మొహిద్దీన్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ వారు మూడవ సారి కూడా గూడూరు వాసి మొహ మ్మద్ మగ్ధూమ్ మొహిద్దీన్‌ను 2025-2026 సంవత్సరానికి గాను జాతీయ స్థాయి మైనార్టీ సెల్ ప్రొటెక్టర్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని విధాలా తనను ప్రోత్స హిస్తున్న మిత్రులకు, శ్రేయోభిలాషులకు, అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## బయోమెట్రిక్ పై అవగాహన

వాకాడు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయం ఆవరణం లోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం బయోమెట్రిక్ డివైజ్‌లను స్త్రీనిధి మేనేజర్ మల్లేశ్వరయ్య, ఏజియం అజయ్‌కుమార్ మండలంలోని పనిచేస్తున్న వివోఏలకు పంపిణీ చేసారు. మండలంలోని పంచాయతీల వారీగా విఒఏల స్త్రీనిధి మేనేజర్ మల్లేశ్వరయ్య సమీక్ష చేయడం జరిగింది. ఈ సమీక్ష కార్యక్రమంలో ఏపీఎం పోలమ్మ, సీసీ సరోజనమ్మ, రమణమ్మ, సిబ్బంది ఉన్నారు.

## ప్రజా సమస్యలపై పట్టించుకోని ఎంపీడీవో!

పూతలపట్టు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: పూతలపట్టు మండల అభివృద్ధి అధికారి మైక్రో స్మాల్ మీడియం ఇంటర్ ప్రెషర్ మంగళవారం సమావేశాన్ని నియోజకవర్గ స్థాయిలో పూతలపట్టు ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహించారు. రైతులకు గాని, చిన్నాచితక కుటీర పరిశ్రమలు నడిపే వారికి కానీ ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తూతూ మంత్రంగా నిర్వహించి, నిరుత్సాహ పరిచిన ఎంపీడీవో వ్యవహారశైలి చాలా దారుణంగా ఉందని పూతలపట్టు నియోజకవర్గం రైతులు వ్యాపారవేత్తలు విమర్శలు చేస్తున్నారు.

## కూసూరు అటవీ ప్రాంతంలో గజరాజులు

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: మండలంలోని కూసూరు అటవీ ప్రాంతంకు తమిళనాడు నుంచి ఆరు ఏనుగుల గుంపు చేరుకుంది. ఈ ఏనుగుల గుంపు దారి మళ్లించేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టారు. కూసూరు అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారం ఉండడంతో కూసూరు, మోట్లచేను, చెక్కునత్తం తదితర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాత్రిపూట ఎవరూ పొలాల వైపు వెళ్లరాదని కుప్పం రే ంజర్ జయశంకర్ పేర్కొన్నారు. కాగా శనివారం రాత్రి రే ంజర్ జయశంకర్ నేతృత్వంలో అటవీ అధికారులు, సిబ్బంది ఏనుగుల దారి మళ్లించి తమిళనాడులోకి పంపేందుకు ట్రాకర్లసాయంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

## టిటిడి చైర్మన్‌ను కలసిన... సురుటుపల్లి ఆలయ అధికారులు



తిరుమలలో మంగళవారం సురుటుపల్లి ఆలయ ఈఓ లత,అర్చకులు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, జానకీదేవి, నరేశ్‌కుమార్, దివాకర్‌రెడ్డిలను ఆశీర్వదించారు.

ప్రభాతవార్త-తిరుమల

## బివికె ఇన్స్టిట్యూషన్స్‌లో ప్రపంచ ఓజోన్ పోర దినోత్సవం





తిరుపతి విద్య, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: ఎపి కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాల యం, తిరుపతి వారి ఆధ్వర్యంలో బివికె గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్, తిరుపతి వారు సంయుక్తంగా మంగళ వారం ప్రపంచ ఓజోన్ దినోత్స వాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యంగా ఓజోన్ పోర పరిరక్షణ, ప్రాముఖ్యతను,విద్యార్థులకు, ప్రజలకు మరింత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చుట్టుపక్కల ఉన్న వివిధ పాఠశాలల నుండి దాదాపు 500 మంది విద్యార్థులు జూనియర్స్ అండ్ సీనియర్స్ విభాగంలో సింపోజియమ్ పోటీలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రంలో వి మదనమోహనరెడ్డి ఎఇఇ, శశికళ,ఎఇఇ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రాంతీయ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ కంట్రోల్ కమిటిలో ముగ్గురికి చోటు



తిరుపతి కలెక్టరేట్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త : హ్యూమన్ రైట్స్ అండ్ అఫెన్స్ కంట్రోల్ కమిటిలో తిరుపతికి చెందిన ముగ్గురు మహిళలకు చోటు లభించింది. కమిటీ తిరుపతి ఎంపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తిరుపతి మునిరెడ్డి నగర్‌కు చెందిన సి.లక్ష్మీదేవికి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి, కో-ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన పి.బిందుకు, అలాగే తిరుపతి నియోజక వర్గ ఇన్‌చార్జిగా పి.శోభావతిని ఏకగ్రీవంగా కమిటి నేతలు, సభ్యులు ఎన్నుకున్నారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి కమిటీ చైర్మన్ బి. మద్దులేటి నుంచి వారి ముగ్గురి మహిళలకు మంగళవారం ఉత్తర్వులు అందాయి. లక్ష్మీదేవి, బిందు, శోభావతి మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకం ఉంచి పదవులు ఇచ్చిన చైర్మన్ మద్దులేటికి, సంఘం పెద్దలు, సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం బలోపేతానికి మహిళల సమస్యల పరిష్కారానికి సైనికుల్లా పనిచేస్తామని హామీ ఇచ్చారు.